Follow: @ANNTELUGU
18-06-2025
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 196 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం ప్రత్యేక సమావేశం

### అన్ని పార్టీల ఎంపీలతో నేడు రేవంత్ కీలక భేటీ

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీలందరికీ లేఖలు
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు గౌరవ అతిథులుగా ఆహ్వానం

**హైదరాబాద్, మహా:** ఏపీ సర్కార్ ప్రతిపాదించిన గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం నేడు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కీలక భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు. మిగతా 2లో

టాప్ న్యూస్

## నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు!



- ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల సంచలన ఆరోపణలు
- ఆ వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని అనుమానం
- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని వ్యాఖ్య

02

## కిషన్ రెడ్డి గారూ.. నాకు టైం ఇవ్వండి!



- పదవుల కోసం నేనెప్పుడు పనిచేయలేదు
- విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దాం
- సమయం ఇస్తే సమస్యలు మీ దృష్టికి తీసుకువస్తా
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు

02

## నేడు గాంధీ భవన్‌కు తుమ్మల



- ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి
- ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరణ

02



## సీఎంను కలిసిన మంత్రి వివేక్

హైదరాబాద్, మహా: సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు.



## కేబినెట్ తీర్మానాల కాపీలు పంపండి

- ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ
- వివరాలను పంపాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- కేసీఆర్, ఈటల, హరీశ్ స్టేట్మెంట్ల ఆధారంగా అడిగిన కమిషన్

వివరాలు 3లో



## డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక


- ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చు
- ఆ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ గెజిట్ పంపించింది
- సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడి

వివరాలు 3లో

## బృహత్తర బాధ్యత కలెక్టర్లదే..

- ఆగస్టు 15 కల్లా భూసమస్యలు పరిష్కారించాలి
- ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలు

వివరాలు 2లో



# 1000 ఫోన్లు ట్యాప్

### ముఖ్యమంత్రి రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ సహా.. 650 మంది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్

#### కాంగ్రెస్ అభ్యర్థుల ఫోన్లన్నీ ట్యాప్

- సినీప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, సర్వే ఏజెన్సీలు, బీజేపీ, బీఆర్ఎస్ నేతల ఫోన్లు కూడా ట్యాప్
- కేసీఆర్ కనుసన్నల్లో.. ప్రభాకర్ రావు టీం ఆపరేషన్
- సంచలనంగా మారిన ట్యాపింగ్ విషయాలు
- మావోయిస్టు సానుభూతిపరుల పేరుతో మా ఫోన్లు ట్యాప్ చేశారు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కీలక మలుపులు తిరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు వేయి మంది ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు వెలుగులోకి రావడంతో బాధితుల నుంచి అధికారులు వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయానికి టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ , గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత యాదవ్ మంగళవారం హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ప్రతిపక్షంలోని కీలక నేతలందరి ఫోన్లన్నీ ట్యాప్ చేశారు. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని అందుకోవాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ క్రమంలో రాష్ట్రంలోని విపక్ష నేతలతోపాటు స్వపక్షంలోనే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేతలు.. అలాగే పక్క రాష్ట్రంలో పలువురి నేతల దృష్టి సారించింది. అందులోభాగంగా వారి ఫోన్లను ట్యాప్ చేసింది.

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో

## పొంగులేటి, కోమటిరెడ్డి టార్గెట్

### పోల్-2023 వాట్సాప్ గ్రూపుతో నిఘా

దొంగదెబ్బ తీసిన ఎస్ఐబి

ట్యాపింగ్‌తో ఆర్థిక మూలాలపై దాడి.. సిట్ విచారణలో సంచలనాలు



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తులో సిట్ అధికారులు వేగం పెంచగా, సంచలనాలు బయటకు వస్తున్నాయి. 2023 ఎన్నికలకు ముందు ఎక్కువమంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు విచారణలో తెలిపారు. రాజకీయ నేతలు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్లే టార్గెట్‌గా ఈ తతంగం నడిపినట్లు అంచనాకు వచ్చారు. 2023 ఎన్నికల వేళ క్రియేట్ చేసిన 'పోల్2023' వాట్సాప్ గ్రూపుపైనా ఆరా తీయబోతున్నారు. ప్రధానంగా ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ ట్యాపింగ్ నిఘా వల్ల అధికంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. మిగతా 2లో




## ఎంత ఖర్చయినా వెనుకాడొద్దు

### రాష్ట్రంలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు

- గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- గో సంరక్షణపై ఉన్నాతాధికరులతో సీఎం సమావేశం

వివరాలు 2లో

## 2018లో మేం ఓడడానికి ట్యాపింగే కారణం

### 2022 నుండి ట్యాపింగ్‌లో కాంగ్రెస్ సీనియర్ల ఫోన్లు

వ్యక్తిగత భద్రతను బీఆర్ఎస్ నేతలు కాలరాశారు

కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ హయాంలో చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లు టాప్ చేశారని, ప్రజాస్వామ్యంలో రాజకీయ నేతల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహేష్ గౌడ్ పోలీసులు ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా ఆయన పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని దుయ్యబట్టారు. మేము మాత్రమే శాశ్వతంగా అధికారంలో ఉండాలనే చెడు ఆలోచనతో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. 2018లో మేము ఓడిపోవడానికి కారణం కూడా తమ నాయకుల ఫోన్లు టాప్



చేయడం వల్లేనని అన్నారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు టాపింగ్‌లో ఉన్నాయని.. సిట్ జాబితాలో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నాయని తెలిపారు. మిగతా 2లో



## ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

- టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు
- రెస్టారెంట్ ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

వివరాలు 3లో

## పీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు!

### ఫోన్ ట్యాప్ వ్యవహారంలో ఆరోపణలు చేశారని నోటీసులు

మీడియా ముందు ఆధారాలు లేని వ్యాఖ్యలు చేశారన్న కేటీఆర్

మహేశ్ కుమార్ గౌడ్ వెంటనే బేషరతుగా క్షమాపణ డిమాండ్

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ పేరిట పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసత్య ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు తన చేతికానీతాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మిగతా 2లో





# 1000 ఫోన్లు ట్యాప్

## ముఖ్యమంత్రి రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ సహా..
## 650 మంది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్

### కాంగ్రెస్ అభ్యర్థుల ఫోన్లన్నీ ట్యాప్

- సినీప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, సర్వే ఏజెన్సీలు, బీజేపీ, బీఆర్ఎస్ నేతల ఫోన్లు కూడా ట్యాప్
- కేసీఆర్ కనుసన్నల్లో.. ప్రభాకర్ రావు టీం ఆపరేషన్
- సంచలనంగా మారిన ట్యాపింగ్ విషయాలు
- మావోయిస్టు సానుభూతిపరుల పేరుతో మా ఫోన్లు ట్యాప్ చేశారు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కీలక మలుపులు తిరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు వేయి మంది ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు వెలుగులోకి రావడంతో బాధితుల నుంచి అధికారులు వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయానికి టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత యాదవ్ మంగళవారం హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ప్రతిపక్షంలోని కీలక నేతలందరి ఫోన్లన్నీ ట్యాప్ చేశారు. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని అందుకోవాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ క్రమంలో రాష్ట్రంలోని విపక్ష నేతలతోపాటు స్వపక్షంలోనే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేతలు.. అలాగే పక్క రాష్ట్రంలో పలువురి నేతల దృష్టి సారించింది. అందులోభాగంగా వారి ఫోన్లను ట్యాప్ చేసింది.

- మహా, హైదరాబాద్

### సిట్‌కు పీసీసీ చీఫ్ స్టేట్‌మెంట్

సిట్ ఎదుట టీపీసీసీ చీఫ్ తన స్టేట్‌మెంట్ ఇచ్చిన తర్వాత మీడియా ముదుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ లో సీఎం రేవంత్ సహా 650 మందికిపైగా కాంగ్రెస్ నేతల ఫోన్ నెంబర్లు ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందే ఫోన్లు ట్యాప్ అయినట్లు తాము ఫిర్యాదు చేశామని ఆయన గుర్తు చేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి తమ ఫోన్లు ట్యాప్ చేయడమే కారణమని, మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు ట్యాప్ చేశారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజకీయ నేతల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య అని, కేసీఆర్ సిగ్గుతో తలవంచుకునే ఘటన అని. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ శిక్షార్హులు అని మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో చెప్పుకొచ్చారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లో ప్రభాకర్ రావు టీం మావోయిస్టు సానుభూతి పరుల పేరుతో ఈ అనైతిక చర్యకు దిగినట్లు నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

### ట్యాపింగ్ బాధితులు కోకొల్లలు

రాజకీయ ప్రముఖులు, ప్రత్యర్థులు, ప్రజాప్రతినిధులతో పాటు భార్యాభర్తల ఫోన్లు కూడా విన్నారన్న ప్రచారం సాగింది. తెలంగాణతో పాటు ఏపీ రాజకీయ ప్రముఖుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు గుట్టు బయటకు వస్తోంది.

**ప్రధాన టార్గెట్**

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్, బండిసంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల, ఎంపీ అనిల్ యాదవ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు
- వ్యాపారవేత్తలు, రియల్టర్లు, జడ్జిలు, ఐఏఎస్ లు, రాజకీయ ప్రత్యర్థులు
- పలువురు సినిమా నటులు, జర్నలిస్టులు, ప్రముఖ ఎన్నికల సర్వేయర్లు
- పలువురు బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు

# నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు!

## ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల సంచలన ఆరోపణలు

### ఆ వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని అనుమానం
### కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని వ్యాఖ్య

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. తన ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని షర్మిల ఆరోపించారు. హైదరాబాద్‌లోనే తన ఫోన్ ట్యాప్ చేశారని అన్నారు. తాను ఎవరెవరితో మాట్లాడుతున్నానో ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని అనుమానం వ్యక్తం చేశారు. ట్యాపింగ్ గుర్తించి వ్యక్తిగత ఫోన్లను మార్చినట్టు చెప్పారు.



**ఆమె వద్ద కీలక ఆధారాలు..**

ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలున్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంతే కాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు.తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

# పొంగులేటి, కోమటిరెడ్డి టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలప్పుడు నేతల ఫోన్లు ట్యాప్ చేసి డబ్బు స్వాధీనం చేసుకోవడంపైన కూడా ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్లు ట్యాప్ చేయడం ద్వారానే విపక్ష నేతల డబ్బుల గురించి తెలుసుకొని.. పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల కంపెనీల డబ్బులు పట్టుకున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇతర పార్టీల నేతలతో పాటు ఆరోజు అధికారంలో ఉన్న పలువురి బీఆర్ఎస్ నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురయినట్లు విచారణలో తేలింది. మరో మంత్రి వివేక్ డబ్బు కూడా దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో నిఘా వేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాతో పాటు పలు జిల్లాల అభ్యర్థులకు పార్టీ సూచన మేరకు పొంగులేటి సహకరించగా, అడుగడుగునా నిఘా టీమ్ లతో ఇబ్బందులు పడ్డారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ చుట్టూ ఉన్న వారిని.. 24గంటలు నిరంతర నిఘాలో ఉంచుకుని ఎప్పటికపుడు సమాచారం తెలుసుకుని కార్యాచరణను కట్టడిచేసే ప్రయత్నం చేశారు. ఫలితంగా గెలుపువాకిట ఉన్న పలు సీట్లను కాంగ్రెస్ కోల్పోయింది.



# నేడు గాంధీ భవన్‌కు తుమ్మల

- ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి
- ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరణ

**హైదరాబాద్, మహా:** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి బుధవారం గాంధీ భవన్‌లో జరుగుతున్న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు. నేడు గాంధీ భవన్‌లో జరిగే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వినతులు సమర్పించుకోవాలని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ముఖాముఖి కార్యక్రమం ద్వారా పార్టీ కార్యకర్తలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను, సూచనలు అభిప్రాయాలను నేరుగా మంత్రులకు తెలియజేసే అవకాశం కల్పించారు. భూ పంచాయతీలు, సీనియర్ సిటిజన్ సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, పార్టీలో పదవులు తదితర సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించనున్నారు.

# బృహత్తర బాధ్యత కలెక్టర్లదే..

## ఆగస్టు 15 కల్లా భూసమస్యలు పరిష్కారించాలి

### ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి
### కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని, గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, భూ భారతి చట్టం ద్వారా ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సిద్ధిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ మంగళవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

**రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమైనవి..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే రెండు నెలలు రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమైనవని, భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై ఏడాదిన్నర అవుతుందని, ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని మంత్రి అన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలుచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి సూచించారు.

# ఎంత ఖర్చయినా వెనుకాడొద్దు

- రాష్ట్రంలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు
- గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- గో సంరక్షణపై ఉన్నాతాధికరులతో సీఎం సమావేశం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి తన నివాసంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు.

**ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలి..**

మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కోడె మొక్కులు చెల్లించే దేవాలయాలైన వేములవాడ, యాదగిరిగుట్టతో పాటు, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలో తొలుత గోశాలలు నిర్మించాలని చెప్పారు. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని, వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని చెప్పారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని.. స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సూచించారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చయినా వెనుకాడదని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను సీఎంకు అందజేశారు.

# 2018లో మేం ఓడడానికి ట్యాపింగే కారణం



(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తో పాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు తెలుస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన అధికారులు.. రాజకీయ నాయకులకు ఏ విధంగా వత్తాసు పలికారో ఈ ఒక్క ఘటన ద్వారా అర్థమవుతోందన్నారు. వ్యక్తిగత భద్రత అనేది ప్రాథమిక హక్కు అని.. బీఆర్ఎస్ నేతలు దానిని కాలరాశారని ఫైర్ అయ్యారు. రిటైర్డ్ అయిన ప్రభాకర్ రావును దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించి ఇలాంటి దుశ్చర్య పాల్పడడం సిగ్గుచేటని విమర్శించారు. నక్సలైట్లకు సింపతైజర్ గా ఉన్నానని ఆరోపిస్తూ తన ఫోన్ ట్యాప్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ప్రతిపక్ష నేతల ఫోన్ ట్యాప్ చేయడం దుర్మార్గమైన చర్య అని.. ఇందుకు కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు.

**శిక్షపడాల్సిందే...**

రాజకీయ లబ్ది కోసం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసిన మీరు శిక్షకు అర్హులని.. భవిష్యత్తులో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందేనని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సజావుగా జరిపి.. నిందితులు రాజకీయ నాయకులైన, అధికారులైన, కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాజకీయ అవసరాల కోసం జర్నలిస్టులు, న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నేతలవే కాకుండా టీడీపీ, బీజేపీ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారనే ఉద్దేశంతో తన ఫోన్ ట్యాప్ చేసినట్లు ప్రభాకర్ రావు పోలీసులకు చెప్పాడని ఆయన అన్నారు.

# కిషన్ రెడ్డి గారూ..
# నాకు టైం ఇవ్వండి!

## పదవుల కోసం నేనెప్పుడు పని చేయలేదు

- విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దాం
- సమయం ఇస్తే సమస్యలు మీ దృష్టికి తీసుకువస్తా
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:**

వ్యక్తిగత విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దామని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. పార్టీలో అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై తాను నేరుగా స్పందించాలనుకుంటున్నానని తెలిపారు. తన ఉద్దేశ్యం ఎప్పుడూ సరళంగా, నిష్కల్మషంగా ఉంటుందని తెలిపారు. మంగళవారం ఓ ప్రకటనను రాజాసింగ్ విడుదల చేశారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలనేది తన లక్ష్యమని రాజాసింగ్ ఉద్ఘాటించారు. తానెప్పుడూ వ్యక్తిగత లబ్ధి లేదా పదవుల కోసం పని చేయలేదని స్పష్టం చేశారు. తన కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడం, పార్టీ ఆదర్శాలను అంకితభావంతో పనిచేయడంపైనే తాను దృష్టి పెట్టానని అన్నారు.



**పార్టీకి నిస్వార్థ సేవ చేశా..**

తెలంగాణలోని అన్ని 119 నియోజకవర్గాల్లో బీజేపీ పార్టీ ఎలా విజయం సాధించడానికి బదులుగా, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, తనను విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారని.. అయినప్పటికీ తాను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేశానని చెప్పారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభమని రాజాసింగ్ ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డానని గుర్తుచేశారు. ఈ రోజు తాను తన కోసం కాకుండా, పార్టీ ఐక్యతకు, అదే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవటం కోసం మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. తాను, పార్టీ సహచరులు మీతో వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తామని చెప్పారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా, ఎప్పుడైనా సమావేశం నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాము పార్టీని విభజించడానికి కాదని, ఐక్యతను తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ నిజమైన లక్ష్యాన్ని మనం మరచిపోకూడదని చెప్పారు. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని అన్నారు.

# పీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు!

(మొదటిపేజీ తరువాయి)

సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా అక్రమంగా పెట్టిన కేసు విచారణకు సైతం హాజరై సహకరించామని తెలిపారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను పూర్తిగా గాలికొదిలేసి ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు.

**కోర్టుకు ఈడుస్తాం..**

అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు తప్ప, ఈ లొట్టపీసు కేసుతో ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెల్లదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం రాజకీయంగా పబ్బం కడుక్కునేందుకు చేసే ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల పైన మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికైనా పరిపాలన పైన దృష్టి పెట్టి, అటెన్షన్ డైవరేషన్ డ్రామాలను పక్కన ప్రతిపక్ష నాయకుల పైన ప్రాపగాండా చేయడం మానాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి చేసే అంశాల పైన దృష్టి సారించాలని హితవు పలికారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం ప్రత్యేక సమావేశం

## అన్ని పార్టీల ఎంపీలతో నేడు రేవంత్ కీలక భేటీ

### కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీలందరికీ లేఖలు
### కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు గౌరవ అతిథులుగా ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానాలు పంపామని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరినట్లు ఆయన వివరించారు.

**ఈ సమావేశం అందుకే..**

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 'ట్రైబ్యునల్ తీర్పులకు, చట్టాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిబనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని చూస్తోంది. ఈ విషయంపై మేము ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మా అభ్యంతరాలను తెలియజేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను కూడా కేంద్రానికి లేఖలు రాశాం. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల నీటి హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించాం" అని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద ఉన్న గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ ఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. "ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకుగాను ఎంపీలందరి అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించాం. అందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశాం' అని ఆయన స్పష్టం చేశారు.

ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ | 18-06-2025
WWW.MAHAADAILY.COM


# డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చు

ఆ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ గెజిట్ పంపించింది

సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మహా:** కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బీఎల్‌వో, బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్‌ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. బీఎల్ఏ, బీఎల్‌వోలకు ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200కు కుదించిందని గుర్తు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచిందని వెల్లడించారు. రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని సీఈఓ గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చని తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని గుర్తుచేశారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని అన్నారు. జూబ్లీహిల్స్‌లో డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నిక జరగాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని అన్నారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- శాంతిచర్చలు జరిపితేనే అన్ని పరిష్కారాలు
- ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా

**హైదరాబాద్, మహా:** ఆపరేషన్ కగార్‌కు నిరసనగా మంగళవారం ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో పాల్గొని డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు.



### తుపాకులు పట్టుకునే వాళ్లం..

మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. ''మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం''అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు.

### సమస్యలపై అడిగితే 'అన్నలు' అంటున్నారు..

ప్రశ్నించే వారిని నక్సలైట్లుగా ముద్ర వేయడం సరికాదని, సమస్యలపై గళమెత్తేవారిని 'అన్నలు' అంటూ నిందిస్తున్నారని, తప్పులు చేసినా మౌనంగా ఉండే వారిని ఏమీ అనడం లేదని ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, మావోయిస్టు సంఘాల నేతలతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# మూడెకరాల వరకు రైతు భరోసా

## రూ. 1,551.89 కోట్లు విడుదల చేసిన సర్కార్

మిగిలిన రైతులందరికీ త్వరలోనే నిధులు జమ చేస్తాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



**హైదరాబాద్, మహా:** రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధులు రైతన్నల ఖాతాల్లోకి చేరాయి. మంగళవారం 3 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులందరికీ ఎకరానికి రూ. 6,000 చొప్పున నిధులను జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 1551.89 కోట్లను విడుదల చేసిందని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ విడతలో మొత్తం 10.45 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీరందరికీ కలిపి 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులు తమ సాగు ఖర్చులను కొంతవరకు తగ్గించుకోవడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కలుగుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

**ఎకరాలతో సంబంధం లేకుండా..**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ముఖ్యమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం 3 ఎకరాల వరకు ఉన్న రైతులకు నిధులు జమ చేసినప్పటికీ, ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన రైతులందరికీ కూడా త్వరలోనే రైతు భరోసా నిధులు జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటన రైతుల్లో మరింత సంతోషాన్ని నింపింది. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. రైతు భరోసా పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో ఒకటి. రైతులను ఆర్థికంగా ఆదుకోవడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, అన్నదాతలకు భరోసా కల్పించడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలు. పెట్టుబడి సాయం అందించడం ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయడానికి, ఇతర సాగు అవసరాలను తీర్చుకోవడానికి ఈ నిధులు ఉపయోగపడతాయి.

# బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్, బీజేపీలదే

## బీసీ రిజర్వేషన్లపై సీఎం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలి

బీసీలను బలిపశువులను చేయాలని చూసే రాజకీయ పార్టీల భరతం పడతాం

బీసీలను మోసం చేయాలని చూస్తే బీజేపీ, కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటాం

బీసీ రిజర్వేషన్లపై త్వరలోనే పెరేడ్ గ్రౌండ్ లో లక్ష లాది మంది తో బీసీల సింహ గర్జన సభ

బీసీ సంఘాల రౌండ్ సమావేశంలో బీసీ నేతలు



**హైదరాబాద్,మహా :** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు హామీ ఇచ్చిన ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యతను కాంగ్రెస్, బిజెపి పార్టీలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి నేతలు ఎక్కడికక్కడ అడ్డుకుంటామని బీసీ సంఘాల నేతలు నేడు తీవ్రంగా హెచ్చరించారు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ల పెంపు భవిష్యత్ కార్యాచరణపై బీసీ సంఘాల మరియు బీసీ మేధావుల అత్యవసర రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షత వహించగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ పూర్వ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు, శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు

ఈ సందర్భంగా జస్టిస్ వంగాల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు చేసి చేతులు దులుపుపోకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అందుకు కాంగ్రెస్ కు బీసీలంతా అండగా ఉంటారన్నారు కేంద్ర ప్రభుత్వం కూడా కులగణపై చిత్తశుద్ధి ఉంటే కులగనకంటే ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అడగాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అడగడం లేదని చేయాల్సిన బాధ్యత ఉన్న బిజెపి ప్రభుత్వం చేయడం లేదని, అడగాల్సిన వారు అడగాలన్న చేయాల్సిన వాళ్లు చేయాలన్న బీసీ ఉద్యమాన్ని ఉదృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు ఢిల్లీలో చేసిన ధర్నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేశారని కానీ అఖిలపక్షంతో ఈరోజు వరకు ఢిల్లీకి వెళ్లి ప్రధాని కలవకపోవడం చాలా బాధాకరమన్నారు . ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ఎవరి మాటను వినకుండా తక్షణమే ప్రధానమంత్రి సమయం కోరి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాల్సిన కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం లోని కేంద్ర మంత్రి అయిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేల కృషి చేయకుండా హైదరాబాదులో ఉండి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు . బీసీల ఓట్లతో గెలిచి బీసీల ప్రయోజనాలకు పాటుపడని రాజకీయ పార్టీలను నాయకులను వచ్చే ఎన్నికల్లో చిత్తూ చిత్తుగా ఓడిస్తామని వారికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై వెనక్కు తగ్గే ప్రసక్తి లేదని రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని లేదంటే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు . రెండు రోజుల్లోనే బీసీ సంఘాలు మేధావులు అందరితో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు

బీసీ ఇంటలెక్వల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు మాట్లాడుతూ తమిళనాడు తరహా కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్ బీసీ రిజర్వేషన్ల బిల్లును చేర్చి బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కొంతమంది చెబుతున్నట్టుగా బీసీ రిజర్వేషన్ల పెంపు జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారని జీవో విడుదల చేయడం వల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఈ జీవోలు భవిష్యత్తులో న్యాయస్థానాల్లో నిలువన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అఖిలపక్ష పార్టీలు బీసీ సంఘాలు మేధావులతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి బీసీ రిజర్వేషన్ల పెంపుపై ముందుకు సాగాలని ఆయన కోరారు .

మాజీ స్పీకర్ ప్రస్తుత శాసనమండలి బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ పార్టీలు అయినా బీసీలకు అన్యాయం చేయాలని తలపెడితే కచ్చితంగా బీసీలంతా పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు . అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీకి అఖిలపక్షంతో వెళితే అందులో తమ పార్టీ కచ్చితంగా పాల్గొంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచే విషయంలో ప్రభుత్వానికి అండగా ఉంటుందని తెలిపారు బీసీలు ఇప్పటికైనా ఒకటి కావాలని లేకుంటే బీసీలకు భవిష్యత్తు లేదని సిరికొండ తెలిపాఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, మహాత్మ జ్యోతిబాపూలే జయంతి నిర్వహణ కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ నేతలు ఉప్పరి శేఖర్ సగర, దీటి మల్లయ్య, ప్రొఫెసర్ నరేందర్, సీనియర్ జర్నలిస్ట్ అశోక్ కుమార్, కోలా జనార్ధన్, దాసోజు లలిత, బి మని మంజరి, గొడుగు మహేష్ యాదవ్, జాజుల లింగం గౌడ్, కిరణ్ కుమార్, కవుల జగన్నాథం, కోల శ్రీనివాస్, ఎకట్టే విజయ్ కుమార్ గౌడ్, సమతా యాదవ్, సంధ్య, గౌతమి, హరినాథ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# కేబినెట్ తీర్మానాల కాపీలు పంపండి..

- ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ
- వివరాలను పంపాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- కేసీఆర్, ఈటల, హరీశ్ స్టేట్మెంట్ల ఆధారంగా అడిగిన కమిషన్

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం నిర్మాణానికి సంబంధించిన అన్ని నిర్ణయాలను కేబినెట్ లో చర్చించే తీసుకున్నట్టు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్ కమిషన్ కు చెప్పిన నేపథ్యంలో అప్పటి కేబినెట్ తీర్మానాల కాపీలను అందజేయాలని కాళేశ్వరం కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా పంపింది. దీనిపై మంగళవారం స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిషన్ అడిగిన వివరాలన్నీ వెంటనే పంపాలంటూ అధికారులను ఆదేశించారు.



# ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

- టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు
- రెస్టారెంట్ ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

**హైదరాబాద్, మహా :** టూరిజం ప్లాజా హోటల్స్ లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ.. ఆహార పదార్థాలను, కిచెన్ ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హరిత హోటల్స్ లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా హరిత హోటల్స్ ను తీర్చిదిద్దుతామని చెప్పారు.

# ఆ ఒక్కరోజే 600 ఫోన్ల ట్యాప్

## పలు చోట్ల నామినేషన్ల ఉపసంహరణ జరగకుండా స్కెచ్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలు బయటకొస్తున్నాయి. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒకే రోజు 600 మంది ఫోన్లు ట్యాప్ చేయడం కలకలం రేపుతోంది. నవంబర్ 15న అంటే నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి రోజున ఎస్ ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు,ప్రణీత్ రావు టీం 600 మంది ఫోన్లను టాప్ చేసింది. ఎస్ ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మావోయిస్టుల పేరు చెప్పి ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డాడు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేశాడు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లు ఇచ్చాడు ప్రభాకర్ రావు. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి చెప్పాడు. మావోయిస్టుల పేరుతో అధికార ,ప్రతిపక్ష ,వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లు టాప్ చేశాడు. అనేక జిల్లాల్లో ప్రత్యర్థిపార్టీలను గందరగోళ పరిచేందుకు నామినేషన్ల ఉపసంహరణ రోజును టార్గెట్ చేసి అస్త్రంగా వాడుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ సిటీలోని పలు నియోజకవర్గాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో రెబెల్స్ నామినేషన్ల ఉపసంహరణ జరగకుండా ట్యాపింగ్ ద్వారా అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

# వాహనాల మరమత్తులో జాప్యం తగదు

## నగర మేయర్ గుండు సుధారాణి




**హన్మకొండ మహా;** వాహనాల మరమత్తులో జాప్యాన్ని నివారించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి బాలసముద్రం లో బల్దియా నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ ను మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వెహికల్ షెడ్ లో ఎన్ని వాహనాలు మరమత్తులకు గురి అయి ఉన్నాయి? ఎన్ని వాహనాలకు ఏ ఏజెన్సీ తో ఒప్పందం కుదుర్చుకున్నారు? వాహనాలు మరమ్మతులకు గురి అయితే అలక్ష్యము వహించకుండా వెంటనే మరమత్తులు చేపట్టాలని వాటికి సంబంధించిన అప్రూవల్ వెంటనే ఇవ్వడం జరుగుతుందని ,స్క్రాప్ కు టెండర్ పిలవాలని వాహనాలకు సంబంధించిన స్క్రాప్ ను వెంటనే డిస్పోస్ చేయాలని కొత్తగా ఎన్ని వాహనాలు కొనుగోలు చేయనున్నారు? మొత్తం ఎన్ని డస్ట్ బిన్లు కొనుగోలు చేస్తున్నారు? ఏజెన్సీ ఎవరు? ఇందులో ఎందుకు జాప్యం జరుగుతుంది ? ఇక్కడ పనులు చేసే రోజువారి సిబ్బంది సంబంధించిన ఏజెన్సీ ఎవరు? ఏజెన్సీ కి అందజేసే రిపేరింగ్ బ్యాలెన్స్ అమౌంట్ ఉంటే సిబ్బందికి వేతనాలు చెల్లించి మిగతా అమౌంట్ వారికి అందజేయాలని సూచించారు. ముఖ్యంగా పెద్ద వాహనాలకు మరమ్మతులకు గురైతే వెంటనే పనులు ప్రారంభించి అప్రూవల్ కోసం ఫైల్ పంపించాలని పారిశుద్ధ్య పనులకు సంబంధించి తరలింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వాహనాల మరమ్మతులు వెంటనే పూర్తి చేసి అందించాలని ఈ సందర్భం గా మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ మహేందర్, డి ఈ లు రాజ్ కుమార్, శివానంద్, ఏఈలు ఫణి, సంతోష్ కుమార్, సానిటరీ సూపర్వైజర్ నరేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, తదితరులు, పాల్గొన్నారు.

# మహేశ్వరి చీరల చరిత్ర

## నర్మదా నది ఒడ్డున నేసిన సంస్కృతికి ప్రతీక

మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది ప్రశాంతమైన ఒడ్డున, అహల్యా కోటతో అలరారే మహేశ్వర్ అనే చారిత్రక పట్టణం ఉంది. ఇక్కడ నేతమగ్గాల శబ్దం, ఐదు వేల ఏళ్ల చరిత్ర ప్రతిధ్వనిస్తుంటాయి. ఈ పవిత్ర భూమిలోనే ప్రసిద్ధి చెందిన మహేశ్వరి చీర పుట్టింది. ఇక్కడి ప్రజల వారసత్వం, రాజభవనం, చరిత్ర ఈ చేనేత కళాఖండంలో ముడిపడి ఉన్నాయి. మహేశ్వర్ ఘాట్ల గుండా నడుస్తుంటే ఇళ్లలో, వర్క్‌షాప్‌లలో చెక్క షటిల్స్ (కుదుళ్లు) లయబద్ధంగా కదులుతున్న మృదువైన శబ్దం వినిపిస్తుంది. ఈ అందమైన మహేశ్వరి చీరలను తయారు చేయడానికి పగలు రాత్రి కష్టపడే నైపుణ్యం కలిగిన చేనేత కార్మికుల శ్రమకు ఆ శబ్దాలు నిదర్శనం. మహేశ్వర్ 18వ శతాబ్దంలో తన అద్భుతమైన వస్త్రాలకు ప్రసిద్ధి చెందింది. అప్పుడు ప్రసిద్ధ మరాఠా రాణి అహల్యాబాయి హోల్కర్, తన రాజధానిలో నేత పనిని ప్రారంభించడానికి సూరత్, దక్షిణ భారతదేశం నుండి నైపుణ్యం కలిగిన నేత కార్మికులను ఆహ్వానించింది. ఆమె కల కేవలం స్థానిక ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం మాత్రమే కాదు.. తన ఆస్థానం సొగసును, నర్మదా ప్రశాంతతను ప్రతిబింబించే ఒక వస్త్రాన్ని సృష్టించడం. అలా పుట్టిందే మహేశ్వరి చీర. ఇది గుసగుసలాడినంత తేలికగా, డిజైన్‌లో ధైర్యంగా, శైలిలో శాశ్వతంగా ఉంటుంది. ప్రతి చీరను మొదట కాటన్, పట్టు దారాలతో నేసేవారు. దేవాలయాలు, ఘాట్‌లు, పవిత్ర నది అలల నుండి ప్రేరణ పొందిన నమూనాలతో రూపొందేవి. నేటికీ లహరియా (అల), చటై (పట్టీ), ఫూల్ (పువ్వు) నమూనాలు మహేశ్వర్ నిర్మాణ వైభవాన్ని తెలియజేస్తాయి.



**మహేశ్వరి చీరలు మామూలు చీరల కంటే ఎందుకు భిన్నం**

మహేశ్వరి చీరలను ప్రత్యేకంగా నిలబెట్టేవి వాటి తేలికైన అల్లిక. సాధారణంగా వీటిని కాటన్, పట్టు మిశ్రమంతో నేస్తారు. అలాగే, వాటి ప్రత్యేకమైన అంచు (బోర్డర్) జరీతో, నెమలి నీలం, చిలుక పచ్చ, ముదురు మెరూన్, బంగారు రంగు వంటి సొగసైన షేడ్స్‌లో తయారవుతాయి.


**అందమైన చీరల వెనుక ఉన్న కళాకారులను కలుద్దాం**

హస్మద్ అన్సారీ, అసిమ్ అన్సారీ... తండ్రీకొడుకులైన వీళ్లిద్దరూ 40 ఏళ్లకు పైగా మహేశ్వరి చీరల తయారీ వ్యాపారంలో ఉన్నారు. హస్మద్ అన్సారీ తండ్రి ప్రారంభించిన ఈ వ్యాపారాన్ని ఇప్పుడు ఆయన కుమారుడు అసిమ్ అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. వారు ఈ వ్యాపారాన్ని ప్రారంభించినప్పటి నుండి ఎప్పుడూ వెనుదిరిగి చూడలేదని అన్సారీ కుటుంబంతో మాట్లాడినప్పుడు తెలిసింది. అసిమ్ అన్సారీ HT లైఫ్‌స్టైల్‌తో మాట్లాడుతూ, "మేం నేతమగ్గాలను మా ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నాం. ముడిసరుకులు సేకరించడం నుండి నేయడం వరకు అన్నీ ఒకే చోట జరుగుతాయి" అని చెప్పారు. నేత మగ్గం ఏర్పాటు చేయడానికి మొదట్లో చాలా కష్టం, పెట్టుబడి అవసరమయ్యాయి. వ్యాపారం పెరిగిన తర్వాత వారు 200 మగ్గాలను, 200 మందికి పైగా నేత కార్మికులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

# పట్టపగలే.. కత్తులు, బ్యాట్ లతో దాడులకు తెగించిన కబ్జా రాయుల్లు

**హైదరాబాద్, మహా :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న ఎఫ్.సి.ఐ. కాలనీ లే అవుట్ లో రోడ్లు మార్కింగ్ చేపట్టిన హైడ్రా ప్లాట్ ఓనర్స్ సమక్షంలో హైడ్రా అధికారులు రోడ్లు మార్కింగ్ చేస్తుండగా.. వీడియో తీస్తున్న ప్లాట్ యజమానులపై సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు అనుచరులు దాడి. ప్లాట్ యజమానురాలైన సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంతపై కత్తి, క్రికెట్ బ్యాట్ తో దాడికి పాల్పడ్డ శ్రీధర్ రావు అనుచరులు. గాయాల పాలైన సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు. పోలీస్ స్టేషన్ ఎదురుగానే పట్టపగలు దుండగులు.. తమపై హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారని వాపోయిన సినీ నటి రమ్యశ్రీ. సంధ్య కన్వెన్షన్ శ్రీధర్ రావు ఆగడాలకు అడ్డుకట్ట వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన నటి రమ్యశ్రీ..

# మెట్రో రైల్ 2.0






## సెకండ్ ఫేజ్‌కు సర్కారు గ్రీన్ సిగ్నల్

### హైదరాబాద్ గేమ్ ఛేంజర్‌గా విస్తరణ

### రెండు భాగాలుగా ఫేజ్ 2

### సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ముందడుగు

మహా- హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ పట్టుదలతో ప్రాజెక్టు విస్తరణకు చకాచకా అడుగులు పడుతున్నాయి. సిటీని చుట్టేసేలా.. అన్ని ప్రాంతాలు కవర్ చేసేలా మెట్రో 2.0కు డిజైన్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాతబస్తీకి రూ.125 కోట్లు విడుదల చేసింది. ప్రాజెక్టు అంచనా వ్యయం 19 వేల 579 కోట్ల రూపాయలు. కారిడార్ 9లో ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కిలోమీటర్లు ఉంది. కారిడార్ 10లో జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్లు. కారిడార్ 11లో జేబీఎస్ నుంచి శామీర్పేట్ వరకు 22 కిలోమీటర్ల చొప్పున సెకండ్ ఫేజ్ పనులను చేపట్టనున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ (ఫేజ్-2) ప్రాజెక్టు రెండు భాగాలుగా విభజించబడింది: ఫేజ్-2 ఎ మరియు ఫేజ్-2 బి. ఈ విస్తరణ హైదరాబాద్ నగరంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం మరియు పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఫేజ్-2 ఎ వివరాలు

ఫేజ్2 ఎ కింద ఐదు కారిడార్లు 76.4 కి.మీ. పొడవుతో రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడతాయి. ఈ కారిడార్లలో ఈ క్రింది విస్తరణలు ఉన్నాయి:

**గ్రీన్ లైన్: ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు**

**రెడ్ లైన్: మియాపూర్ నుంచి పటాన్‌చెరు, LB నగర్ నుంచి హయత్‌నగర్**

**బ్లూ లైన్: నాగోల్ నుంచి ఎయిర్ పోర్ట్ , రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్**

ఈ ప్రాజెక్టు కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణనగర వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించబడింది మరియు ఇది కూడా జాయింట్ వెంచర్‌గా ప్రతిపాదించబడింది. ఈ దశ పూర్తయిన తర్వాత రోజుకు 8 లక్షల మంది ప్రయాణికులను రవాణా చేయగలదని అంచనా.

## పాతబస్తీకి ప్రత్యేక దృష్టి

పాతబస్తీలోని 7.5 కి.మీ. ఎంజిబిఎస్-చంద్రాయణగుట్ట మార్గంలో 311 ఆస్తులను సేకరించి, రూ.283 కోట్లు చెల్లించబడ్డాయి. చార్మినార్, ఫలక్‌నుమా వంటి వారసత్వ కట్టడాలకు ఎటువంటి హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ తెలిపింది. ఈ ప్రాంతంలో మెట్రో విస్తరణకు రూ.125 కోట్లు కేటాయించబడ్డాయి, ఇది చారిత్రాత్మక ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది.

## ఫేజ్-2 బి వివరాలు

తెలంగాణ ప్రభుత్వం ఫేజ్II బి కింద మూడు కొత్త కారిడార్ల నిర్మాణానికి రూ.19,579 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 50:50 జాయింట్ వెంచర్‌గా నిర్మితమవుతుంది. ఈ దశలో 86.1 కి.మీ. పొడవైన మూడు కారిడార్లు ఉంటాయి:

**కారిడార్ 1:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు (39.6 కి.మీ.)

**కారిడార్ 2:** జూబ్లీ బస్ స్టేషన్ (జెబిఎస్) నుంచి మేడ్చల్ వరకు (24.5 కి.మీ.)

**కారిడార్ 3:** జూబ్లీ బస్ స్టేషన్ (జెబిఎస్) నుంచి షామీర్‌పేట్ వరకు (22 కి.మీ.)

ఈ కారిడార్లు ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్ మరియు గ్రేడ్ వద్ద నిర్మించబడతాయి, ఇవి నగరంలోని ఉత్తర హైదరాబాద్ మరియు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కు కనెక్టివిటీని మెరుగుపరుస్తాయి. ఈ ప్రాజెక్టు రూ.5,874 కోట్లు (30%) రాష్ట్ర ప్రభుత్వం, రూ.3,524 కోట్లు (18%) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 48% (రూ.9,398 కోట్లు) జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా), ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ మరియు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుండి రుణాల ద్వారా సమకూర్చబడుతుంది.

## ఓల్డ్ సిటీలో.. చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణి హవేలి

కాగా ఇటీవల పాతబస్తీలోని వారసత్వ కట్టడాల పరిరక్షణ చర్యలపై.. సమగ్ర అధ్యయనం చేయకుండానే మెట్రో పనులు ప్రారంభించడాన్ని సవాలు చేస్తూ.. హైకోర్టులో పిల్ దాఖలైంది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నగర అభివృద్ధి ప్రణాళికలో వారసత్వ సంపద పరిరక్షణ ప్రాముఖ్యతపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఓల్డ్ సిటీలో.. చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణి హవేలి, మొగల్‌పురా టూంబ్ లాంటి వాటికి ప్రమాదం పొంచి ఉందని.. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టుకు విన్నవించింది. ఈ ప్రాజెక్టుల వల్ల చారిత్రక కట్టడాల పునాదులు దెబ్బతినే అవకాశం ఉందని.. వాటి నిర్మాణాత్మక స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పిల్‌లో తెలిపారు. ఈ కట్టడాలు తెలంగాణ చరిత్రకు, సంస్కృతికి ప్రతీకలని.. భవిష్యత్ తరాల కోసం వాటిని పరిరక్షించాలన్నారు.

## పురావస్తు విభాగాల నిపుణులతో కమిటీ ఏర్పాటు

ఇక.. హెరిటేజ్ రక్షణ, పర్యావరణ, పురావస్తు విభాగాల నిపుణులతో కూడిన ఒక కమిటీతో.. సమగ్ర అధ్యయనం చేయించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర పురావస్తు శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నాకే.. పనులు కొనసాగించాలని.. అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా.. ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అభివృద్ధి ప్రాజెక్టుల రూపకల్పనలో సాంస్కృతిక వారసత్వం, పర్యావరణ ప్రభావ అంచనాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటివరకు మెట్రో రెండవ దశ పనులను నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.



## ఇది కీలకం

శంషాబాద్ ఎయిర్‌పోర్టు- ఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లలో ఎయిర్‌పోర్టు నుంచి 1.5 కి.మీ భూగర్భ మార్గంలో, 21 కిలోమీటర్లు ఎలివేటెడ్ (ఆకాశ మార్గంలో), 17 కిలోమీటర్లు ఎట్ గ్రేడ్ (భూమిపై) ట్రాక్ ఉంటుందన్నారు. మొత్తం 86.1 కిలోమీటర్లతో పార్ట్-బీ డీపీఆర్‌ను తయారు చేశారు.

## కిలోమీటరుకు రూ.227.39 కోట్లు

పార్ట్-బీ కింద జేబీఎస్ మెట్రో స్టేషన్- మేడ్చల్ (24.5 కిలోమీటర్లు), జేబీఎస్ మెట్రో స్టేషన్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లు చేపడుతున్నారు. అయితే పార్ట్-ఏలో కిలోమీటరుకు సుమారు రూ.318కోట్లతో అంచనాతో డీపీఆర్‌ను తయారు చేయగా.. పార్ట్-బీలో కిలోమీటరుకు రూ.227.39 కోట్లతోనే రూపొందించినట్లు తెలుస్తోంది. పార్ట్-బీలోని ఫ్యూచర్‌సిటీ మార్గంలో భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడంతో ఖర్చు తగ్గిన పరిస్థితి కనిపిస్తోంది.



### శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి
# ఆఫ్రికాకు విమాన సేవలు



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంనుండి ఆఫ్రికాకు ఖండానికి నేరుగా విమాన సేవలు ప్రారంభిస్తూ, దేశీయ అంతర్జాతీయ విమాన సేవల విస్తరణలో మరో కీలక ఘట్టాన్ని జీఎంఆర్ సంస్థ ప్రారంభించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో విమానాశ్రయాల్లో శంషాబాద్ ఒకటిగా నిలుస్తుంది. ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలోని బోలే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు నేరుగా విమాన సేవలు జూన్ 17 న ఈ సర్వీసులు ఘనంగా ప్రారంభమయి. కార్యక్రమంలో (గేల్) సీనియర్ అధికారులతో పాటు, ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు, ఇతర ముఖ్య వ్యక్తులు పాల్గొన్నారు. ఈ సేవలను ఆఫ్రికాలో అతి పెద్ద, అత్యంత విశ్వసనీయమైన విమానయాన సంస్థ అయిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఇది హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వాణిజ్యం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాల కేంద్రంగా మారుస్తుంది. దక్షిణ భారతదేశం, ఆఫ్రికా ఖండం మధ్య కీలకమైన గాలి మార్గంగా ఈ నూతన రూట్ వ్యవహరిస్తోంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ దోపిడి

## రూ 8.70 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కార్యక్రమంల్లో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**భూపాలపల్లి మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో గత బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర సొమ్ము దోపిడీ చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం భూపాలపల్లి జిల్లాలో 8.70 కోట్ల విలువైన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన, ప్రారంభించిన అనంతరం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు లు నిర్మాణం అత్యంత ప్రమాదకరం, డిజైన్ కు కట్టిన దానికి పొంతనలేదని ఎన్డీఎస్ఏ చెప్పినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ప్రాజెక్టులు చిన్న పగులు కూడా రాలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని, ఆదాయం లేని కుటుంబాలు ఉండొద్దని.. ఆకలితో ఏ ఒక్కరు బాధపడొద్దు అనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని వెనుకబడనివ్వం, అభివృద్ధిని ఆగనివ్వమని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం 2 వేల మెగావాట్లు విద్యుత్ అదనపు డిమాండ్ వచ్చినా రాష్ట్రంలో ఒక్క నిమిషం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర రాష్ట్ర ప్రభుత్వానిదని తెలిపారు. ఉచిత విద్యుత్ పథకాల కోసం రాష్ట్ర ప్రజల పక్షాన ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,992 కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన బిఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా కాళేశ్వరం ప్రహ్యోదమని చెబుతుంటే జనం నవ్వుకుంటున్నారని అన్నారు. కాళేశ్వరం కుంగిపోతున్న విషయాన్ని ఫోటోలతో బయటపెట్టింది జర్నలిస్టులు, కాళేశ్వరం అత్యంత ప్రమాద కరమైన పరిస్థితిలో ఉందని ఎన్ డి ఎస్ ఏ నివేదిక ఇచ్చిందని, చూపెట్టిన డిజైన్ కు కట్టిన దానికి పొంతన లేదని స్పష్టం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ఎస్ .ఆర్ .ఎస్. పి. అంగు కమైనా కదిలిందా, శ్రీపాద ఎల్లంపల్లి కి ఏమైనా ఇబ్బంది వచ్చిందా? నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఇంజనీర్ల పని వారిని చేయకుండా బి ఆర్ ఎస్ నేతలు డిజైన్ చేయడం, పనుల్లో పూర్తిగా జోక్యం చేసుకోవడంతో పెద్ద ఇబ్బంది వచ్చి పడిందని డిప్యూటీ సీఎం అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అని ఎన్నికల ముందు టిఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు, 2025 మార్చిలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడింది.. టిఆర్ఎస్ నేతల పాలన కాలం 2023 మార్చి తో పోలిస్తే ఈ సంవత్సరం 2 వేల మెగావాట్లు డిమాండ్ అధికంగా వచ్చింది అయినా ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రాష్ట్ర ప్రజలకు సేవ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి అని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ విజయం సాధించిన లైన్మెన్ నుంచి సిఎండి వరకు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు 16 వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది, రాష్ట్రంలో 50 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం మొత్తంగా ఉచిత విద్యుత్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రతి సంవత్సరం 13,992 కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ ఈ రాష్ట్రంలో సంక్షేమాన్ని వెనుకబడనివ్వం అభివృద్ధిని ఆగనివ్వం అని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రం లో ఏ ఒక్కరు ఇల్లు లేకుండా, ఆదాయం లేకుండా ఇబ్బంది పడొద్దు ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరు ఆకలితో ఏ ఒక్కరూ ఎంత మాత్రం ఇబ్బంది పడొద్దు అనేదే ప్రజా ప్రభుత్వం ఆలోచన అన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు ప్రతి రూపాయిని దోచుకున్నారు, కోట్లకు కోట్లు మేయ్యడంతో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు, జీవన ప్రమాణాలు పెరగలేదు అందుకే రాష్ట్ర ప్రజలు 2023లో పరిస్థితిని అర్థం చేసుకొని కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

### ఇంజనీరింగ్ కళాశాలలో డొనేషన్ పేరుతో జరుగుతున్న
# దోపిడీని రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలి


## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్



**రాజేంద్రనగర్ మహా:** ఇంజనీరింగ్ కళాశాలల్లో కౌన్సిలింగ్ ల పేరుతో కళాశాల యజమాన్యం డొనేషన్ పేరుతో అందిన కాడికి దండుకుంటుందిఅన్నారు. విద్యా మండలి కార్యాలయం ముందు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్ ఆధ్వర్యంలో మంగళ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థుల సీట్ల భర్తీ విషయంపై ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. కౌన్సెలింగ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు వలవేసి డొనేషన్లు వసూలు చేస్తు తల్లిదండ్రులపై అధిక భారం మోపుతున్నారు. కౌన్సిలింగ్ పేరుతో డొనేషన్లు వసూలు చేస్తున్న కళాశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి, అలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్షిప్ విడుదల కానీ కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థుల ఈ సమస్యను పరిష్కరించాలి. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బీజేవైఎం అధ్యక్షులు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, తరుణ్, చితరంజాన్, కుమార్, సంతోష్, ప్రధాన కార్యదర్శిలు సామల పవన్, గణేష్, సురేష్, కోశాధికారి యోగి, కార్యదర్శి ప్రవీణ్, అశోక్, నాయకులు సుధీంద్ర శర్మ, అరవింద్, వినీత్, అనిత, మహేందర్, భగీరత్, నితిన్, అవినీష్, నరేన్, గోవర్ధన్, రామకృష్ణ, ఆకాష్, అరుణ్, చక్రి, వినేయ్, రాఘవేంద్ర, ఇంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్సీకి పోలీసులు
# ఎస్కార్ట్ ఇవ్వడంపై రగడ

- వరంగల్ డివిజన్ పోలీసులకు సీపీ షాక్
- ఏసిపితో పాటు పోలీస్ అధికారులకు మెమోలు జారీ
- పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న సీపీ



C.No. 349/CP-Camp/WRL/2025

Office of the Commissioner of Police, Warangal, Dt. 17.06.2025

MEMO

A news article under the caption "Vidhulanu Vadili Konda Venta Velli" has been published in Namaste Telangana daily news paper on 14.06.2025, wherein it was mentioned that, on 13.06.2025, you along with your staff have performed duties as escort/pilot and also provided Police Bandobust, during the visit programme of Sri Konda Murali, Ex-MLC in your jurisdiction, even though, there was no necessity of the same.

Further, it is noticed that, as per the proceedings of the Security Review Committee, he is not entitled for any security cover i.e Escort/Pilot. As such, these number of Police force i.e ACP, CIs, SIs were not supposed to be utilized for the above said programme.

Due to your act, the common people have been criticizing the Police. Further, this news article gone viral in social media and the image of Police is getting tarnished.

Hence, you are hereby instructed to explain as to why disciplinary action shall not be initiated against you for the above lapse. Your explanation should reach this office within (2) days from the date of receipt of this memo, failing which, it will be presumed that, you have no valid explanation to offer and disciplinary action will be taken on merits.

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని వరంగల్ సబ్ డివిజన్ పోలీస్ అధికారుల తీరు పై గత కొంతకాలంగా సర్వత్ర విమర్శలున్నాయి. ఎలాంటి రాజ్యాంగ పదవి లేని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు కు వరంగల్ ఏసీపీ తోపాటు పోలీస్ అధికారులు ప్రోటోకాల్ ను విస్మరిస్తూ, పర్సనల్ సెక్యూరిటీ గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించిన పోలీసు అధికారుల పై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సీరియస్ గా స్పందించారు. నిబంధనలకు విరుద్ధం గా కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించిన వరంగల్ ఏసీపీ, సీఐ తో పాటు మరో ఇద్దరు అధికారులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ మెమోలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లుగా పలు మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా జారీ చేసిన మెమోల్లో సీపీ పేర్కొన్నారు. మీ పై చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలుపలంటూ సీపీ మెమోలో అధికారులను వివరణ కోరారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం పోలీసు అధికారులు కొండా మురళికి ఎస్కార్ట్ తీసుకెళ్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. దీంతో ఈ విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడం, ప్రతిపక్షాలు, సామాన్య జనాలు, ముఖ్యంగా నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో దీనిపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే సీపీ వరంగల్ డివిజన్ పోలీస్ అధికారులకు మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. గతంలో కూడా వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ కు మెమో జారీ అయినట్టు సమాచారం. మెమోలు జారీ చేయడంతో పాటు వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

# రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

## వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రైతుభరోసా పథకంలో భాగంగా, పంట పెట్టుబడి సాయం అందిస్తున్నదని ఇందులో భాగంగా వానాకాలం 2025 కి సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు లక్ష 29 వేల 542 మంది రైతు ఖాతాల్లో 94 కోట్ల 16 రూపాయలు రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో 1,65 109 మంది రైతులకు 166 కోట్ల 33 లక్షల రూపాయల నిధులు విడుదల చేయుటకు గాను రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ నందు పొందు పరచడం జరిగిందని తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి లక్ష 29 వేల 542 మంది రైతు ఖాతాల్లో 94 కోట్ల 16 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని, మిగతా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. కాగా, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు

### కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది.. నిర్మించిన గోడను తొలగించండి
### రైల్వే అధికారికి వినతి పత్రం అందజేసిన. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శివరాంపల్లి రైల్వే గేట్ కు అడ్డుగా గోడ నిర్మించారు. ఈ గోడ నిర్మాణంతో డివిజన్ పరిధిలోని పలు కాలనీవాసులు స్థానిక ప్రజలు విద్యార్థులు వ్యాపారస్తులు వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటూ 6 నుంచి 8 కిలోమీటర్లు ఎక్స్ట్రా తిరగవలసి వస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక బిజెపి నాయకులు పలు కాలనీవాసులతో కలిసి హైదరాబాద్ సికింద్రాబాద్ సంబంధించిన డీజీఎం రైల్వే అధికారి ఉదయ్ నాథ్ ని కలిసి సమస్యను వివరించారు. గత 50 సంవత్సరాల ముందు నుంచి ఈ రోడ్డును కాలనీవాసులు వాహనదారులు వ్యాపారస్తులు విద్యార్థులు వాడుతున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం రైల్వే గేట్ మెయింటెనెన్స్ కోసం రహదారి కి అడ్డంగా గోడ నిర్మించారు. దానితో మూడు సంవత్సరాలుగా ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్లు పైగా ప్రయాణిస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించాలని రైల్వే అధికారికి వినియాతి పత్రం అందజేశారు. రైల్వే డిజిఎం ఉదయ్ నాథ్ సానుకూలంగా స్పందిస్తూ స్థానిక రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని తతెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డి ఆర్ ఎఫ్ కార్యకలాపాల పై సమీక్షించారు. అనంతరం సఫాయి మిత్రా కార్మికుల ఆరోగ్య రక్షణలో భాగంగా నమస్తే కార్యక్రమం క్రింద 37 మంది సఫాయి మిత్ర కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లకు పి పి ఈ పిట్లను కిట్లను మేయర్, కమిషనర్లు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోన, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఇంచార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ శివ లింగం, హార్టికల్చర్ ఆఫీసర్లు రమేష్, లక్ష్మారెడ్డి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఎఫ్ శంకర్ లింగం పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో 60 తాటి చెట్ల నరికివేత

**రంగారెడ్డి జిల్లా మహా:** మంచాల మండలం ఆరుట్ల గ్రామం సర్వే నెంబర్ 693/7 లో ఉన్న 100 తాటి చెట్లను నరికి వేస్తున్నారని సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం అబ్కారీ శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అధికారులు చేరుకునే సమయానికి 60 తాటి చెట్లు నేలమట్టం చేశారని, అధికారులు వస్తున్నారన్న సమాచారం అందుకున్న జెసిబి ఆపరేటర్లు అక్కడి నుంచి పారిపోయారని ఎస్ఐ తెలిపారు. మోహన్ రెడ్డి అనే రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేరుకున్న అబ్కారీ శాఖ ఎస్సై నాగమణి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ... ఎవరైనా తన సొంత పొలంలో అయినా తాటి చెట్లు నరికి వేయాలంటే సంబంధిత ఆబ్కారీ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఈ తాటి చెట్లు నరికివేత పై ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, అనుమతులు గాని లేవని దీనికి కారణం ఎవరైనా వదిలిపెట్టేది లేదని, చట్టానికి లోబడి అందరూ అనుమతులు పొందాలని ఆబ్కారి శాఖ అధికారులు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎస్సై నాగమణితో సిబ్బంది గణేష్, ప్రేమలతలు పాల్గొన్నారు.

# రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం



## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాలుష్యం లేని నూతన పరిశ్రమల శంకుస్థాపనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై ఇబ్రహీంపట్నంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన 17 దుకాణ సముదాయాలను ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం గ్రామ శివారు నుంచి సుమారు మూడు కోట్ల 50 లక్షలతో ఎమ్మెల్యే బైపాస్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. aఅనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు రుణమాఫీ, వ్యవసాయానికి 24 గంటల కరెంటు, రైతు భరోసా డబ్బుల మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసి, రైతాంగానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఇబ్రహీంపట్నంలోని మార్కెట్ యార్డ్ లో నూతనంగా నిర్మించిన దుకాణ సందేహాలను ఈ ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్లోని దుకాణాలు రైతులకు మాత్రమే కేటాయించాలని, రైతులకు కాకుండా వేరొకరికి కేటాయించరాదని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అన్ని విధాలుగా ఉండేలా ఒక భవనాన్ని, మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని త్వరలో ప్రారంభించుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన తెలిపారు. యాచారం మండలంలోని ఫార్మాసిటీని రద్దు చేయడం జరిగిందని రైతులకు తెలిపారు.

# బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

## చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్



**ఆదిలాబాద్, మహా:** బడీడు పిల్లలు పనిలో కాకుండా పాఠశాలల్లో ఉండాలనే ఉద్ధేశ్యంతో బాల కార్మికులను గుర్తిస్తున్నామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలో వివిధ రెస్టారెంట్లు, పండ్లు, స్క్రాప్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులతో పాటు వ్యాపారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గుర్తించిన బడీడు పిల్లలను వారు ఉంటున్న కాలనీల్లోనీ సమీప ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చేర్పించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేసి వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. పిల్లలు బడిబయట ఉండకుండా వారి భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వ్యాపారులు కూడా చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట పరంగా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను పాఠశాల్లో చేర్పించి వారికి విద్య బుద్దులు నేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై అనిత, కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సుదీప్ రెడ్డి, అవుట్ రిచ్ వర్కర్ ఆశ్విని, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, సీఆర్పీ భానుప్రకాష్, షూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, కానిస్టేబుల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి చెరువు పూడిక తీత పనుల్లో కమిషన్ల మోత..
# పత్రికలో వచ్చిన వార్త అవాస్తవం

**వరంగల్ మహా;** 03.02.2025 నుండి 08.03.2025 వరకు MLC ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి సంబంధిత పరిపాలన విభాగాలతో సమన్వయం చేసుకుని ఇప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియ చేపట్టబడిందని, దీనికి చాలా సమయం పట్టిందని టెండర్ల స్థితిని ఎప్పటికప్పుడు జిల్లా పరిపాలనా అధికారులకు తెలియజేస్తూ బిడ్ షరతుల ప్రకారం టెండర్, ఇతర కార్యకలాపాలు చేపట్టడం జరిగిందని డిపార్ట్మెంట్ విధానాలను పారదర్శకంగా అనుసరిస్తూ మూల్యాంకనాన్ని ఖరారు చేశాయి. అందువల్ల డిపార్ట్మెంటల్ టెండర్ కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఆధారంగా వార్తను మహా పత్రికలో ప్రచురించిన వార్త అవాస్తవంగా తెలుపుతున్నాం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత అధికారి మహా పత్రిక ప్రతినిధికి వెల్లడించారు.

# ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకోవాలి

## జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వ విద్య సంస్థల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పట్టణంలోని భవిత విలీన విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విలీన విద్యా దినోత్సవం, బాలిక విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ బాలిక విద్య ప్రాముఖ్యతను, సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యతలు, వారికి విద్య అందించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలతో అక్షరాభ్యాసం చేయించి భవిత కేంద్రంలో అడ్మిషన్ చేయించారు. ఏడవ తరగతి పూర్తి చేసుకున్న పిల్లలను పై తరగతి కోసం వివిధ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమయ్య, సెక్టోరల్ అధికారులు సుజాత్ ఖాన్, తిరుపతి, శ్రీకాంత్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లచ్చిరాం, ఎన్జీవో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, భవిత కేంద్రం ఐఈఆర్పీలు పుష్పవేణి, రాజన్న పాల్గొన్నారు.




# ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి

## హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** 3 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ తల్లిదండ్రులు దగ్గరలోని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ హనంకొండ జిల్లా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి గారి అధ్యక్షతన 49వ డివిజన్ జులైవాడ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ కి పిల్లల్ని పంపించినట్లయితే వారిలో శారీరక పెరుగుదలతో పాటు మానసిక, సామాజిక, మేధో అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. అంగన్వాడీ టీచర్స్ అందరూ చిత్తశుద్ధితో న్యూ కరికులమ్ ప్రకారం ఫాలో అవుతూ పిల్లలని అంగన్వాడీ కేంద్రం పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించుకోవాల్సిందిగా ఆదేశించారు. ఉదయం 9 గంటలకే అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బెల్ మోగించి ప్రీస్కూల్ కార్యక్రమాలని న్యూ టైం టేబుల్, సిలబస్ ద్వారా నిర్వహిస్తూ ప్రీస్కూల్ నమోదు, హాజరు నుపెంచి, పిల్లలని సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్వాడీ సెంటర్లోనే ఉంచవలసిందిగా కోరారు.

# ప్రజా పాలనతోనే గ్రామాల అభివృద్ధి

- మంచాల మండలంలో 435 మందికి ఇండ్లు
- ఆరుట్ల చెన్నారెడ్డిగూడలో అభివృద్ధి పనులు ప్రారంభం
- విద్యావ్యవస్థ మెరుగవడానికి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచాల మండలంలో 435 మందికి ఇళ్ళ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రంగారెడ్డి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే గ్రామాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, వారి సొంతింటి కలను సాకారం చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండలంలోని, ఆరుట్ల, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లో పర్యటించిన ఆయన 1.40 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆరుట్లలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న, మొట్టమొదటి తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మంచాల మండల కేంద్రంలో మంచాల మండలానికి చెందిన 435 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను మరియు మండల పరిధిలోని 53 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల అభివృద్దే లక్ష్యంగా అధిక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. గత పదేళ్ల కాలంలో వెనుక బడిన విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేయడానికి, ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం చేయడానికి రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయిలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, రాష్ట్రంలో మొట్టమొదటగా ఆరుట్ల గ్రామంలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని అన్నారు. గత పదేళ్లలో ఏ ఒక్క పేదవాడికి న్యాయం జరుగలేదని, ఏ ఒక్క కుటుంబానికి ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంచాల మండలానికి 435 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క పేదవాడికి ఇండ్లు రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, గుండెమోని జయమ్మ, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, అధికారులు ఎమ్మార్వో ప్రసాదరావు, ఎంపీడీఓ బాలశంకర్, ఆరుట్ల స్కూల్ హెచ్ఎం గిరిధర్ గౌడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుప్రియ, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాతిరి ఎల్లేష్, కొర్ర పాండు, మండల పార్టీ అధ్యక్షులు విండమూరి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, సుంకరి పాండరీనాథ్, ఎడమ నరేందర్ రెడ్డి, జెనిగ వెంకటేష్ ప్రేమాకర్ రెడ్డి, అశ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు

# 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మంజూరు

### ప్రభుత్వ కార్యాలయాల కోసం రైతులు భూములు ఇవ్వడం సంతోషకరం

### సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే నాగరాజు కృషి అభినందనీయం



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడంతో నేడు వర్ధన్నపేట పట్టణ కేంద్రం లోని గువ్వల బోడు కి చెందిన ప్రభుత్వ భూములను మంగళవారం ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటిగ్రేటెడ్ స్కూల్, మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు, సబ్ డివిజన్ కోసం అనువైన స్థలాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా పరిశీలించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ**

సుదీర్ఘ కాలంగా ఎంతోమంది ఎమ్మెల్యేలు ఈ నియోజకవర్గానికి పరిపాలన చేసిన కూడా వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఏ రోజు పట్టించుకున్న పాపాన పోలేదని, నియోజకవర్గంలో అనువైన స్థలం లేదని దాటవేసి ప్రభుత్వ విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించుకొని పోయారు. దీంతో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడి పోయిందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. నేను నాయకుడిని కాదు సేవకుని అని నిరూపించుకోవడానికి సమయం ఆసన్నమైందని, వర్ధన్నపేట పట్టణ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కల ఇంటిగ్రేటెడ్ స్కూల్, ద్వారా నిజం కానుండటంతో వారి ఆనందానికి అవధులు లేవని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా రంగానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని కొనియాడుతూ నియోజకవర్గ ప్రజలు, నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా స్థానిక దళిత, గిరిజన రైతులు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడం చాలా సంతోషకరమని వారందరికీ ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా గువ్వల బోడు ప్రాంతం పాఠశాల నిర్మాణానికి అత్యంత అనుకూలంగా ఉందని, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమై, పాఠశాల విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

**మృతుడు మెరుగు రాజేష్ కుటుంబానికి పరామర్శ**

వర్ధన్నపేట మండల పరిధి లోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మెరుగు రాజేష్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏపీ రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ నిర్వహణలో అలసత్వం వహించరాదు

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** శానిటేషన్ నిర్వహణలో అలసత్వాన్ని వీడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.మంగళవారం వరంగల్ నగర పరిధిలోని 25, 26 డివిజన్ లలో చార్ బౌలి ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను కమిషనర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జవాన్ లు, సిబ్బంది మాన్యువల్ గా సంతకాలు చేయడంతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం విధులకు హాజరై, వెళ్లేటప్పుడు నమోదు చేయాలని , అటెండెన్స్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే వేతనాల చెల్లింపు జరుగుతుందని తెలిపారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ గుడి వద్ద గల చౌరస్తా నుండి చార్ బౌలి వాటర్ ట్యాంక్ వరకు నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కలియతిరిగిన కమిషనర్ స్థానికులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలని, తడి పొడి చెత్తను వేరుగా అందజేయాలని అవగాహన కల్పించి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి అందజేస్తూ, స్టిక్కర్ లను గృహాలకు అతికించి, స్వచ్ఛ ప్రతిజ్ఞ లో పాల్గొన్నారు. చార్ బౌలి వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహిస్తున్న డి ఆర్ సి సి సెంటర్ తో పాటు నర్సరీనీ పరిశీలించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించిన కమిషనర్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు మరింత బలోపేతం చేస్తూ మరో ప్లాంటు ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలిన సురేష్, సి.ఎం.హెచ్.ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ ఈ, సి పి లు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, వెటర్నరీ డాక్టర్ డా.గోపాల్ రావు, ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఏ సి పి ఖలీల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, ఏ ఈ లు మొజామిల్, హబీబ్, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ పాల్గొన్నారు.



## పోలీస్ కమిషనర్ ను కలిసిన జిల్లా కలెక్టర్

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ లోని వరంగల్ పోలీస్ కమిషనరేట్కా ర్యాలయంలోని పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ జిల్లా కలెక్టర్కు శుభాకాంక్షలు తెలిపారు.



## వరంగల్ జిల్లా జర్నలిస్ట్స్ పిల్లలకు ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ

### వరంగల్ జిల్లా కలెక్టర్, డీఈఓ కు కృతజ్ఞతలు తెలిపిన టీఎస్ జేయూ

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీఎస్ జేయూ వరంగల్ జిల్లా నాయకులు ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ను కోరగా తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని కల్పించాలంటూ వరంగల్ జిల్లా డిఈఓ కు తెలియపరచగా వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ జిల్లా డీఈఓ ఎం జ్ఞానేశ్వర్ జర్నలిస్ట్స్ పిల్లలకు ప్రత్యేక రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని టీఎస్జేయు (TSJU) నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ జేయు వరంగల్ జిల్లా నాయకులు వరంగల్ జిల్లాలో పనిచేస్తున్నటువంటి వర్కింగ్ జర్నలిస్ట్స్ పిల్లలకి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని ఇవ్వడం పట్ల వరంగల్ జిల్లా కలెక్టర్ కు అలాగే డీఈఓ కు కృతజ్ఞతలు తెలిపారు.



## నిజాయితీగా పోలీసులు విధులు నిర్వహించాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. హన్మకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్ స్టేషన్లతో పాటు సిసిస్, టాస్క్ ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగాల్లో నూతన ఇన్స్ స్పెక్టర్లు గా బాధ్యతలు చేపట్టిన మచ్చ శివకుమార్, రంజిత్, రాఘవేందర్, సత్యనారాయణ, సతీష్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు.

## మైనర్లతో వాహనాలు నడిపిస్తే యజమానులపై కేసులు

### డిఎస్పి సూర్యనారాయణ



**కాటారం, మహా :** మైనర్లకు వాహనాలు ఇచ్చే యాజమానుల పై కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పి సూర్యనారాయణ హెచ్చరించారు.. కాటారం మండలంలోని మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బస్వాపూర్ గ్రామానికి చెందిన మైనర్ బాలుడుతో ట్రాక్టర్ యజమాని వెన్నపురెడ్డి సమ్మయ్య ట్రాక్టర్ తో పనిచేయిస్తుండగా యజమాని, ట్రాక్టర్ పై కేసు నమోదు చేశారు. మైనర్లతో పనులు చేస్తే బాల కార్మిక చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు మైనర్లకు వాహనాలు ఇచ్చి నడిపించిన పని చేయించిన సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని కాటారం డిఎస్పి సూర్యనారాయణ హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాజీ కౌన్సిలర్ చెన్నెం అశోక్ చేయూత



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గొల్లపల్లి వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు సుమారు 100 మంది పైచిలుకు విద్యార్థులు ఉంటారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థులకు ఈ స్కూల్ యూనిఫామ్ బూట్లు షూ, బెల్టులను గొల్లపల్లి మాజీ కౌన్సిలర్ చెన్నెం అశోక్ తన సొంత నిధులను వేచించి విద్యార్థులకు కావలసిన వస్తువులను అందజేస్తామన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు కావలసిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఉపాధ్యాయులు మొహమాట పడకుండా విద్యార్థులకు కావలసిన వసతులతో పాటు చదువుకు సంబంధించిన వస్తువుల విషయంలో సంకోచించకుండా తమకు తెలియజేయాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి సైంటిస్టులు డాక్టర్లు ఇంజనీర్లని కొని ఆడారు. గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో చదువుకుంటున్న విద్యార్థులు అదృష్టవంతులని ఉపాధ్యాయులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు చంద్రారెడ్డి, గణేష్, ప్రవీణ్ కుమార్, శేఖర్, ప్రశాంత్ రెడ్డి, సతీష్, సంతోష్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు

### రైల్వే అధికారికి వినతి పత్రం అందజేసిన. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శివరాంపల్లి రైల్వే గేట్ కు అడ్డుగా గోడ నిర్మించారు. ఈ గోడ నిర్మాణంతో డివిజన్ పరిధిలోని పలు కాలనీవాసులు స్థానిక ప్రజలు విద్యార్థులు వ్యాపారస్తులు వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటూ 6 నుంచి 8 కిలోమీటర్లు ఎక్స్ట్రా తిరగవలసి వస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక బిజెపి నాయకులు పలు కాలనీ వాసులతో కలిసి హైదరాబాద్ సికింద్రాబాద్ సంబంధించిన డీజీఎం రైల్వే అధికారి ఉదయ్ నాథ్ ని కలిసి సమస్యను వివరించారు. గత 50 సంవత్సరాల ముందు నుంచి ఈ రోడ్డును కాలనీవాసులు వాహనదారులు వ్యాపారస్తులు విద్యార్థులు వాడుతున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం రైల్వే గేట్ మెయింటెనెన్స్ కోసం రహదారి కి అడ్డంగా గోడ నిర్మించారు. దానితో మూడు సంవత్సరాలుగా ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్లు పైగా ప్రయాణిస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించాలని రైల్వే అధికారికి వినియాతి పత్రం అందజేశారు. రైల్వే డిజిఎం ఉదయ్ నాథ్ సానుకూలంగా స్పందిస్తూ స్థానిక రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు.

## శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి వివిధ పార్టీల నాయకులు సహకరించాలి

### 11 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులో సుమారు రూ 11 కోట్లతో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజ పనులను, నూతన బిటి రోడ్లు పనులకు స్థానిక కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ సుష్మా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావులతో కలిసి మంగళవారం శకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతుంటాయని పేర్కొన్నారు. పేద ప్రజలకు జీవితంలో ఆదరణ,భరోసా కల్పించేందుకు ప్రజా పాలనతో మన ముందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ఒకటిగా ఒకటిగా నెరవేరుతున్నాయి. అనేక సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతు అమలు చేస్తున్నాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చిత్త శుద్ధితో ఉందన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సంక్షేమ పథకాల పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,నూతన రేషన్ కార్డులు,నాలుగు నూతన పథకాలను ప్రారంభించాము. ప్రజల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాతాంరాయి బస్తీలో గత మూడు రోజుల క్రితం బస్తీకి వెళ్లే రహదారిలో నిరుపేదలు చిరు వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రేటెడ్ కమ్యూనిటీ యజమాన్యం ఫిర్యాదుతో పేదవారు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు చిరు వ్యాపారస్తులు మొరపెట్టుకున్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా ఒక పక్కకు చిరు వ్యాపారులు తమ వ్యాపారం కకొనసాగించాలన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారస్తులు ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ఖాళీ ప్రదేశంలో తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి తప్ప ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, గణేష్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీనాయకులు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జానంపేట శ్రీ భవాని మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు

**షాద్ నగర్, మహా:** జానంపేట శ్రీ భవాని మాత దేవాలయంలో బీఆర్ఎస్ యువ నాయకుడు వై. రవీందర్ యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం ప్రారంభోత్సవ అనంతరం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. శ్రీ భవాని మాత అమ్మవారిని శక్తిస్వరూపిణిగా, లక్ష్మీ దేవిగా ఆరాధించడం మన హిందూ సంప్రదాయమని, గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల ప్రజలు అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ అని అభిప్రాయపడ్డారు. మనశ్శాంతి కోసం మన ఇష్ట దైవాన్ని నిత్యం పూజించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీఆర్ఎస్ నాయకులు బచ్చలి నరసింహా, సుజీవన్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చెట్ల నరసింహా, నంద కిషోర్, నందిగామ శ్రీనివాస్, చెట్ల జంగయ్య, నరసింహా, భువనేశ్వర్ రెడ్డి, గుండు అశోక్, కొండ మల్లేష్, మంగ శ్రీశైలం, చెర్క శివ, పిట్టల మల్లేష్, రాజు తదితరులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు..

# బీఆర్ఎస్ నాయకుల నిర్వాకమే

### షాద్ నగర్ బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**షాద్ నగర్, మహా :** పొట్టోడి నెత్తి పొడుగోడు కొడితే పొడుగోడి నెత్తి పోచమ్మ కొట్టింది అన్నట్టు బిఆర్ఎస్ నాయకులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి వ్యక్తిగత గోప్యతను హరించారని తమ సంభాషణలు బహిరంగం చేసి చివరకు సాధించింది ఏమిటని? షాద్ నగర్ బిజెపి నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం షాద్ నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ప్రత్యేక పోలీసు అధికారి ఏసిపి వెంకటగిరి నేతృత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరిగిందని స్పష్ట చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల విషయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ వాటిని తుంగలో తొక్కిందని, స్వార్థ రాజకీయాల కోసం దిగజారిందని విష్ణువర్ధన్ రెడ్డి "పరోక్షంగా" విమర్శించారు. 2023 నవంబర్ ఆఖరిలో 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు తన డాటా పోలీసుల వద్ద లభించిందని అంతకుముందు రెండు నెలలకు సంబంధించిన డేటా మాత్రం అప్పటి అధికారులు ధ్వంసం చేశారని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా తనపై అనేక ఇబ్బందులు జరిగాయని అందులో భాగంగానే తన ఫ్యాక్టరీ ఇతర వ్యాపార సంస్థలు ఇంకా ఎన్నికలకు సంబంధించిన వ్యవహారంలో 8 కేసులు నమోదు చేశారని తెలిపారు. పక్కా పథకం ప్రకారం ఫోన్లు టాపింగ్ జరిగాయని ఆరోపించారు. దినంతటికీ అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ కారణమని రాష్ట్ర నాయకులు కావచ్చు ఇక్కడి స్థానిక నాయకుల ప్రమేయం కావచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. సదరు పార్టీకి చెందిన ఒక యువ నాయకుడు టికెట్ రాదని ముందుగా ప్రచారం చేశాడని ఆ విషయం తనకు తెలుసని అన్నారు. తనతో మాట్లాడిన 50,000 మందికి సంబంధించిన గోప్యతను హరించారని ఇది చాలా అన్యాయం అని విచారం వ్యక్తం చేశారు. తనతో ఎందరో వ్యాపారస్తులు నాయకులు కార్యకర్తలు జర్నలిస్టులు న్యాయవాదులు ఇంకా ఎన్నో రంగాలకు చెందినవారు ఎన్నో విషయాలు మాట్లాడారని ఇప్పుడు వారందరీ మాటలు విని వాళ్లను టార్గెట్ చేస్తారా? గెలిచి ఉంటే పెద్ద ఇబ్బంది ఎదురయ్యేదని అనుమానం వ్యక్తం చేశారు. ఇన్ని అడ్డదారులు తొక్కి చివరకు సాధించింది ఏమిటని ప్రశ్నించారు. తను సింహంగా సింగిల్ గానే ఎన్నికల్లో దిగానని అప్పటి ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం తనను టార్గెట్ చేశారని అన్నారు. అయినప్పటికీ ఒంటి చేత్తో ముప్పైవేలకు పైగా ఓట్లు తనకు లభించాయని నైతికంగా తనదే గెలుపని అన్నారు. తన ఫోన్ సంభాషణలు వింటూ అనేక ఇబ్బందులు కార్యకర్తలకు నాయకులకు తనకు ఎదురయ్యాయని స్పష్టం చేశారు. తనతో మాట్లాడిన వారందరినీ బెదిరించి తమ దారికి తిప్పుకోగలిగారని కానీ గెలవలేకపోయారని విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తాను ఓడిపోయినందుకు బాధ లేదని కానీ తనకు అన్యాయం తలపెట్టిన వారు ఓడిపోవడం పట్ల తనకు సంతోషంగా ఉందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అన్యాయం చేసి చివరకు ఏం సాధించారని వాళ్ళ నాయకుడు కెసిఆర్ చెప్పినట్లు పొట్టోడి నెత్తి పొడుగోడు కొడితే పొడుగోడి నెత్తి పోచమ్మ కొట్టింది అన్నట్టే వాళ్ళ పరిస్థితి మిగిలిందన్నారు.

**నా పెళ్ళాంతో నేను మాట్లాడా..**

నా పెళ్ళాం బిడ్డలతో, నా కన్న తల్లిదండ్రులతో నేను మాట్లాడా.. నాలాగే మీరు కూడా మీ పెళ్ళాంతో మాట్లాడి ఉంటారు సంసారం అన్నాక అందరూ చేసేది అదే కదా..? ఎవరు కొత్తగా మాట్లాడేది ఏముంటుంది? చేసేది ఏముంటుందని? మరి మంది సంభాషణలు విని ఏం సాధించారని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత గోప్యతను హరించడం చాలా నేరమని రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ప్రధాన స్వేచ్ఛ హక్కు ఇదని, దీనిని కూడా నాశనం చేసిన గత ప్రభుత్వ పెద్దల నాయకుల తీరు చూస్తే ప్రజలు కూడా ప్రజలు చిదరించుకుంటారని అన్నారు. గత ఎన్నికల్లో తన ఫోన్ సంభాషణలు విని తనకు ఎంతో నష్టం చేశారని ఇది తన ఒక్కడితో ఆగిపోలేదన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. కచ్చితంగా షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల నాయకులవే కాదు స్వపక్ష నాయకుల ఫోన్లు కూడా టాపింగ్ కాబడ్డాయని ఈ విషయం తనకు విచారణలో తెలిసిందని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మరో బాంబు పేల్చారు. ఇది చాలా అన్యాయం అని ఒక నాయకుడికి కార్యకర్త మీద విశ్వాసం ఉండాలని నాయకుడికి కార్యకర్తకి మధ్య ఒక భార్యాభర్తల మధ్య ఉన్న పవిత్రమైన సంబంధం మాదిరిగా ఉండాలని కానీ ఆ విశ్వాసం లేకుండా ఎన్నికల్లో పోటీ చేసినందుకు ఓడిపోయారంటూ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి వేదాంతం వల్లించారు. విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మోహన్ సింగ్, లష్కర్ నాయక్, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, బాల్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్,తదితరులు ఉన్నారు..



# తగ్గిన ఇంధన వాడకం

దేశీయంగా వివిధ ప్రాంతాల్లో ముందుగా వర్షాలు పడుతుండటంతో ఈ నెల(జూన్) తొలి రెండు వారాల్లో ఇంధన వినియోగం మందగించింది. ప్రొవిజనల్ పారిశ్రామిక గణాంకాల ప్రకారం రెండు నెలల పురోగతి తదుపరి డీజిల్ వినియోగం క్షీణించింది. ఈ బాటలో రెండు నెలల వినియోగ వృద్ధి తదుపరి పెట్రోల్‌కు సైతం డిమాండ్ నీరసించింది. జూన్ 1-15 మధ్య పెట్రోల్ డిమాండ్‌లో వృద్ధి 2.3 శాతానికి పరిమితమై 1.4 మిలియన్ టన్నులను తాకింది. దేశీయంగా 90 శాతం మార్కెట్ వాటా కలిగిన మూడు ప్రభుత్వ రంగ ఇంధన రిటైల్ సంస్థల గణాంకాలివి. మే నెలలో పెట్రోల్ డిమాండ్ 9 శాతం పుంజుకున్న సంగతి తెలిసిందే. జూన్ తొలి అర్ధభాగంలో డీజిల్ వినియోగం 4.8 శాతం క్షీణించింది. 3.26 మిలియన్ టన్నులకు పరిమితమైంది. దేశీయంగా అత్యధిక వినియోగమున్న డీజిల్ ఏప్రిల్‌లో 4 శాతం బలపడగా.. మే నెలలో 2 శాతం వృద్ధి నమోదైంది. ఈ నెల తొలి రెండు వారాల్లో పెట్రోల్ అమ్మకాలు 7 శాతం తగ్గాయి. మే నెల 1-15 మధ్య 1.5 మిలియన్ టన్నుల పెట్రోల్ వినియోగం నమోదైంది. అయితే 2023 జూన్ 1-15తో చూస్తే వినియోగం 7 శాతం ఎగసింది. మరోపక్క ఇదే కాలంలో డీజిల్ డిమాండ్ 5.2 శాతం క్షీణించగా.. వినియోగం మే నెలతో పోలిస్తే 3.1 శాతం తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెరగడానికి వినియోగం ఊతమిచ్చింది.

# ఇంధనం వాడకుండానే వాహనాల తరలింపు

## మారుతి సుజుకి మానేసర్ ఫెసిలిటీలో అభివృద్ధి



గ్రీన్ లాజిస్టిక్స్, సమర్థవంతమైన వెహికల్ డిస్పాచ్ కోసం మారుతి సుజుకి తన మానేసర్ ఫెసిలిటీలో భారతదేశపు అతిపెద్ద ఆటోమొబైల్ ఇన్‌ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను ప్రారంభించింది. లాజిస్టిక్స్‌లో కార్బన్ ఉద్గారాలను, శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించడం, రహదారి రద్దీని కట్టడి చేయడం ఇన్‌ప్లాంట్ రైల్వే సైడింగ్ లక్ష్యంగా పెట్టుకుంది. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా హరియాణా ఆర్బిటల్ రైల్ కారిడార్ (హెచ్ఓఆర్‌సీ)తో భాగస్వామ్యం ఏర్పరుచుకొని మారుతి సుజుకి ఈ సదుపాయాన్ని సోనిపట్ నుంచి పల్వాల్ వరకు 126 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసింది. ఈ సదుపాయాన్ని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు మల్టీ మోడల్ కనెక్టివిటీకి గేమ్ ఛేంజర్ అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రశంసించారు. సమర్థవంతమైన ఆటోమొబైల్ రవాణాలో కొత్త ఆవిష్కరణలు చేస్తూ, గ్రీన్ లాజిస్టిక్స్‌లో మారుతి సుజుకి ఆవిష్కరణలు చేస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

**రైల్ లాజిస్టిక్స్ ద్వారా సుస్థిరత**


భారతదేశపు అతిపెద్ద కార్ల తయారీదారుగా మారుతి సుజుకి పర్యావరణ ప్రభావాన్ని తగ్గించేందుకు దాని సరఫరా గొలుసును ఆప్టిమైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త రైల్వే సైడింగ్ వాహనాల డిస్పాచ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని కంపెనీ భావిస్తుంది. ఇది రోడ్డు రవాణాపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని చెప్పింది.

**రైల్వే సైడింగ్ ముఖ్య లక్షణాలు**

- 46 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాంట్‌ను పూర్తిగా విద్యుదీకరణ చేశారు. నాలుగు ఫుల్ లెంత్ ట్రాక్‌లు, ఒక ఇంజిన్ ఎస్కేప్ ట్రాక్ ఉన్నాయి.
- 4,50,000 వాహనాల వార్షిక డిస్పాచ్ సామర్థ్యం కలిగి ఉంది. నిర్మాణాత్మక మల్టీ మోడల్ కనెక్టివిటీ విధానం ద్వారా భారతదేశం అంతటా 380 నగరాలకు సేవలు అందిస్తుంది.
- ముంద్రా, పిపావావ్‌తో సహా ఇతర ఓడరేవులతో అనుసంధానం చేశారు. ప్రపంచ మార్కెట్లకు వాహన ఎగుమతులను ఇది క్రమబద్ధీకరిస్తుంది.
- హెచ్‌వోఆర్‌సీ అభివృద్ధికి రూ.325 కోట్లు, అంతర్గత రైల్వే యార్డు మౌలిక సదుపాయాలకు రూ.127 కోట్లు కేటాయించారు.
- ఈ కొత్త వ్యవస్థ ఏటా 1,75,000 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుంది. 60 మిలియన్ లీటర్ల ఇంధనాన్ని ఆదా చేస్తుందని అంచనా.

## ప్రభుత్వ బ్యాంకు సారథులతో

# త్వరలో మంత్రి భేటీ



ప్రభుత్వరంగ బ్యాంక్‌ల చీఫ్‌లతో ఈ నెల 27న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ కానున్నారు. బ్యాంకుల పనితీరుతోపాటు పలు ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల లక్ష్యాలపైనా చర్చ జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆర్‌బీఐ ఈ నెల మొదట్లో రెపో రేటును అర శాతం తగ్గించిన తర్వాత ఆర్థిక మంత్రి బ్యాంక్‌లతో నిర్వహిస్తున్న మొదటి సమీక్ష కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. జీడీపీ వృద్ధి నాలుగేళ్ల కనిష్ట స్థాయి 6.5 శాతానికి తగ్గడంతో ఆర్థిక వృద్ధికి మద్దతుగా ఉత్పాదక రంగాలకు రుణ వితరణ పెంచాలని ఆర్థిక మంత్రి ఈ సమావేశంలో బ్యాంక్‌లను కోరే అవకాశాలున్నట్టు తెలిపాయి. కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం ముద్రా, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల పరంగా పురోగతిని మంత్రి సమీక్షించనున్నట్టు వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరంలో 12 ప్రభుత్వరంగ బ్యాంక్‌ల లాభం అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 26 శాతం పెరిగి రూ.1.78 లక్షల కోట్లకు చేరడం గమనార్హం.

# కొత్త సిమ్ తీసుకునేవారికి జియో బంపర్ ఆఫర్



కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వినియోగదారులకు సరికొత్త డిజిటల్ అనుభవాన్ని అందించేందుకు రిలయన్స్ జియో స్టార్టర్ ప్యాక్‌ను ప్రారంభించింది. కేవలం రూ.349తో యూజర్లు ఈ ప్యాక్‌ను పొందవచ్చని కంపెనీ తెలిపింది. కొత్తగా సిమ్ కొనుగోలు చేసే యూజర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ ప్యాక్ డిజిటల్ యుటిలిటీ, కస్టమర్ల అనుభవాన్ని పెంచే లక్ష్యంతో కొన్ని ప్రయోజనాలను అందిస్తుంది.


**జియో స్టార్టర్ ప్యాక్ ప్రయోజనాలు..**

- 5G నెట్‌వర్క్‌లో 28 రోజుల పాటు అపరిమిత సేవలు వినియోగించుకోవచ్చు.
- 50 రోజుల ఉచిత జియోఫైబర్/ ఎయిర్‌ఫైబర్ ట్రయల్ కనెక్షన్ (టీవీ + వైఫై + OTT యాప్‌లు) పొందవచ్చు.
- 50 జీబీ ఉచిత జియో ఏఐ క్లౌడ్ స్టోరేజీ పొందవచ్చు.
- 4K క్వాలిటీతో టీవీ / మొబైల్‌లో 90 రోజుల పాటు ఉచిత జియో హాట్‌స్టార్ వీక్షించవచ్చు.

ఈ ప్రయోజనాలను ఒకే ఆఫర్‌లో అందించడం ద్వారా కొత్త వినియోగదారులకు డిజిటల్ అనుభవాన్ని సులభతరం చేయడం జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలాఉండగా, ఏప్రిల్ 2025కి విడుదలైన ట్రాయ్ నివేదిక ప్రకారం.. అత్యంత పోటీ ఉన్న వైర్‌లెస్ (మొబైల్) విభాగంలో అధికంగా సబ్‌స్క్రైబర్లను జోడించింది. జియో 95,310 కొత్త సబ్‌స్క్రైబర్లను జోడించి మార్చి 2025లో 3,17,76,074 ఉన్న మొత్తం వినియోగదారులను ఏప్రిల్ 2025లో 3,18,71,384కి పెంచుకుంది.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

## 212 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్..



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్‌లో ఐటీ మినహా ఇతర సూచీలు నష్టాల్లో కొనసాగాయి. ఫలితంగా మార్కెట్లు పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,869.47 స్వల్ప లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్ది సేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 81,890.15 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,427.01 పాయింట్లకు పడిపోయింది. చివరకు 212.85 పాయింట్లు పతనమై.. 81,583.30 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 93.10 పాయింట్లు దిగజారి.. 24,853.40 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,443 షేర్లు లాభపడ్డాయి. 2,384 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, ఎటర్నల్, ఓఎన్‌జీసీ నష్టపోగా.. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి సుజుకీ లాభాల్లో కొనసాగాయి. ఐటీ మినహా, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్, ఆటో, రియాలిటీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.52 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# పశ్చిమాసియాలో మూతపడ్డ ఎయిర్‌పోర్ట్‌లు..

## చిక్కుకుపోయిన వేలాది మంది ప్రయాణికులు



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పశ్చిమాసియా దేశాల కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇజ్రాయెల్ దళాలు పెద్ద ఎత్తున క్షిపణి దాడులకు పాల్పడుతుండటంతో.. తమ గగనతలాన్ని పలు దేశాలు మూసివేశాయి. ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ తన గగనతలాన్ని పూర్తిగా మూసివేసిన విషయం తెలిసిందే. తాజాగా లెబనాన్, జోర్డాన్, ఇరాక్ దేశాలు కూడా విమానాల రాకపోకలను నిలిపివేశాయి. ఈ చర్యతో పశ్చిమాసియా వ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్‌లు మూతపడ్డాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు అక్కడ చిక్కుకుపోయారు. దాదాపు 10 వేల మందికిపైగా ప్రజలు పశ్చిమాసియా దేశాల్లో చిక్కుకుపోయినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్ సైతం తమ దేశంలోని అత్యంత కీలకమైన బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేసింది. తదుపరి నోటీసులు వచ్చే వరకూ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపింది. దీంతో దాదాపు 50 వేల మందికిపైగా ఇజ్రాయెల్ ప్రయాణికులు విదేశాల్లో చిక్కుకున్నారు. మరోవైపు ఇరాన్ దాడులు కొనసాగుతుండటంతో దేశంలోని మూడు విమానయాన సంస్థలకు చెందిన జెట్ విమానాలను లార్నాకాకు తరలించారు. ఇజ్రాయెల్ పౌరులు జోర్డాన్, ఈజిప్ట్‌లతో ఉన్న సరిహద్దుల ద్వారా దేశం విడిచి వెళ్లవద్దని, ఆ ప్రాంతాల్లో ప్రమాదం పొంచి ఉందని ప్రధాని నెతన్యాహు హెచ్చరికలు జారీ చేశారు.



# ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడి

ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య దాడులు తీవ్ర రూపం దాల్చాయి. ఇరాన్‌లోని అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల దాడులు చేస్తుండగా.. ఇజ్రాయెల్‌లోని వ్యూహాత్మక ప్రాంతాలపై ఇరాన్ క్షిపణి దాడుల కు పాల్పడుతోంది. ఈ క్రమంలోనే మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ 'మొస్సాద్' కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడికి పాల్పడింది. అత్యంత కచ్చితత్వంతో మొస్సాద్‌పై బాంబుల వర్షం కురిపించినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. అంతేకాకుండా గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ మిలిటరీ ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌పైనా క్షిపణిని ప్రయోగించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఇజ్రాయెల్ పక్కా ప్రణాళికతో ఇరాన్‌పై దాడులు చేస్తోందంటే అందుకు కారణం కచ్చితంగా మొస్సాద్ సంస్థే. ఇరాన్‌లో అణుస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న సంగతి నుంచి.. కీలక అధికారులు, శాస్త్రవేత్తల గృహాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా 'మొస్సాద్' ఇజ్రాయెల్‌కు చేరవేసింది. ముందుగానే ఇరాన్‌కు భారీ మొత్తంలో డ్రోన్లను తరలించి ఇజ్రాయెల్ కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించడం వెనుకా మొస్సాద్ హస్తం ఉంది. ఈ నేపథ్యంలోనే మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ క్షిపణిని ప్రయోగించినట్లు తెలుస్తోంది. చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మధ్యవర్తుల ద్వారా అటు ఇజ్రాయెల్, ఇటు అమెరికాలకు సమాచారం ఇచ్చిన ఇరాన్.. దాడులను మాత్రం ఆపడంలేదు. ఇరుదేశాల మధ్య మొదలైన ఈ ఘర్షణపై ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది ఎక్కడికి దారితీస్తుందో తెలియని పరిస్థితులు కన్పిస్తున్నాయి.

# ఢిల్లీలో కుండపోత వర్షం


## నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు



దేశ రాజధాని ఢిల్లీలో కుంభవృష్టి కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలువడంతో చెరువులను తలపిస్తున్నాయి. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిపాల్‌పూర్ ఏరియాలోని ఓ కూడలిలో వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహదేవ్ రోడ్, వీడీ మార్గ్, నోయిడా సెక్టార్ 11 తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కుంభవృష్టి పడింది. మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆ వెంటనే భారీగా వర్షం మొదలైంది. మహిపాల్‌పూర్ ఏరియాలో రోడ్లపై వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

## ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ సుప్రీం లీడర్

# ఖమేనీ సన్నిహితుడు మృతి



పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా.. తాజాగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం మొదలైంది. గతవారం ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వరుసగా ఐదో రోజు కూడా ప్రతిదాడులతో ఇరు దేశాలూ విరుచుకుపడుతున్నాయి. ఇక ఈ దాడుల్లో ఇరాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలను ఇరాన్ కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇరాన్ అత్యున్నత సైనిక కమాండర్, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి అత్యంత సన్నిహితుడు అలీ షాద్మానీ హతమయ్యారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం తాజాగా ప్రకటించింది. సోమవారం రాత్రి మంగళవారం తెల్లవారుజామున మధ్య టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న కమాండ్ సెంటర్‌పై తాము జరిపిన దాడుల్లో అలీ షాద్మానీ ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. షాద్మానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఇరాన్ సాయుధ దళాలు.. ఈ రెండింటికీ నాయకత్వం వహిస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఇరాన్‌పై శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. ఇరాక్‌తో 1980లో జరిగిన భీకర యుద్ధం తరువాత తిరిగి ఆ స్థాయిలో దాడులను ఎదుర్కోవడం ఇరాన్‌కు ఇదే మొదటిసారి. ఈ దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల ప్రధాన అధికారి జనరల్ మొహమ్మద్ బాఘేరి, రెవెల్యూషనరీ గార్డ్స్ జనరల్ హొస్సేన్ సలామీ, ఖండాంతర క్షిపణి కార్యక్రమం అధికారి జనరల్ అమీర్ అలీ హాజీజాదే, పలువురు శాస్త్రవేత్తలు, ఇరాన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ డిప్యూటీ హెడ్ ఆఫ్ ఇంటెలిజెన్స్ జనరల్ ఘోలంరేజా మెహ్రాబీ, డిప్యూటీ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ జనరల్ మెహదీ రబ్బానీ మరణించిన విషయం తెలిసిందే.

**బంకర్‌లో దాక్కొన్న ఖమేనీ**

ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, ఆయన కుటుంబం టెహ్రాన్ ఈశాన్య ప్రాంతంలోని ఒక బంకర్‌లో దాక్కొన్నారని తెలిసింది. యురేనియాన్ని శుద్ధి చేసుకొనే కార్యక్రమాన్ని పూర్తిగా వదిలేసేందుకు ఖమేనీకి ఇజ్రాయెల్ చివరి అవకాశమిచ్చిందని.. అందువల్లే దాడులు జరిగిన మొదటి రోజైన శుక్రవారం రాత్రి ఆయనను హత్య చేయకుండా వదిలేసిందని ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పేర్కొంది.

# ఫెయిల్డ్ మార్షల్.. అమెరికాలో పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు నిరసన సెగ




అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కు నిరసన సెగ తగిలింది. సొంత దేశ ప్రజలే ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఫీల్డ్ మార్షల్ కాదు.. ఫెయిల్డ్ మార్షల్' అంటూ విమర్శించారు. ఐదు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఆసిమ్ మునీర్ ఆదివారం అగ్రరాజ్యానికి చేరుకున్నారు. అక్కడ వాషింగ్టన్‌లోని ఓ హోటల్‌లో దిగారు. ఈ విషయం తెలుసుకున్న పాక్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆసిమ్ మునీర్ హోటల్ నుంచి బయటకు వస్తున్న సమయంలో 'ఆసిమ్ మునీర్.. నువ్వు పిరికివాడివి', 'నీకు సిగ్గు లేదు..', 'సామూహిక హంతకుడు..', 'నియంత..', 'ఫెయిల్డ్ మార్షల్..' వంటి నినాదాలు చేశారు. నిరసనకారుల ఆందోళనలతో అప్రమత్తమైన అధికారులు వారిని అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిమ్ మునీర్‌కి ఫీల్డ్ మార్షల్‌గా పాక్ ప్రభుత్వం పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ నిర్ణయం తీసుకుంది. భారత్‌తో పోరులో పాక్ బలగాలను ముందుండి నడిపించినందుకే ఆయన ప్రమోషన్ ఇచ్చినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. ఫీల్డ్ మార్షల్ అన్నది పాక్‌లో అత్యున్నత మిలిటరీ ర్యాంకు. పాక్‌లో ఈ హోదా పొందిన రెండో వ్యక్తి మునీరే కావడం విశేషం. ఇంతకుముందు 1959లో జనరల్ ఆయుబ్ ఖాన్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా కట్టబెట్టారు. 2022 నవంబర్‌లో ఆర్మీ చీఫ్‌గా మునీర్ బాధ్యతలు చేపట్టారు. మునీర్‌కు ఆ దేశ సుప్రీంకోర్టు ఇటీవలే మరిన్ని అధికారాలు కల్పించింది. మిలిటరీ కోర్టుల్లో పౌరులను విచారించేందుకు అనుమతించింది.

# పూరీ పెద్ద ప్లాన్..

'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' డిజాస్టర్ల దెబ్బకు పూర్తిగా ఆలోచనలో పడిపోయిన డైరెక్టర్ పూరీ జగన్నాథ్.. తన రూట్ మార్చి స్టోరీ రాశాడు. దాన్ని తమిళ నటుడు విజయ్ సేతుపతికి చెప్పి మెప్పించాడు. కొన్ని నెలల క్రితం ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ కాగా.. ఇందులో ఎవరెవరు నటిస్తారనే విషయాన్ని ఒక్కొక్కరిగా ప్రకటిస్తున్నారు. తాజాగా హిట్ చిత్రాల హీరోయిన్‌ని తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మలయాళ నటి సంయుక్త.. ఇప్పటివరకు చాలా సినిమాలు చేసింది. వాటిలో చాలావరకు హిట్ అయ్యాయి. తెలుగులోనూ భీమ్లా నాయక్, బింబిసార, సర్, విరూపాక్ష తదితర చిత్రాలతో సక్సెస్ అందుకుంది. ప్రస్తుతం స్వయంభు, అఖండ 2, హైందవ, నారీ నారీ నడుమ మురారీ అని నాలుగు చిత్రాలు చేస్తోంది. ఇప్పుడు పూరీవిజయ్ సేతుపతి ప్రాజెక్ట్‌లోకి ఎంటరైంది. సంయుక్తని తీసుకున్న విషయాన్ని పూరీ ఛార్మీ ప్రకటించారు. ఆమెతో కలిసున్న ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజయ్ సేతుపతి మూవీలో ఇప్పటికే టబు, కన్నడ నటుడు దునియా విజయ్ ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు సంయుక్త కూడా ఉందనేసరికి మూవీపై అంచనాలు పెరుగుతున్నాయి. ఈ చిత్రంలో సేతుపతి.. బిచ్చగాడిగా కనిపించనున్నాడని తెలుస్తోంది. త్వరలో షూటింగ్ ప్రారంభించి ఈ ఏడాది చివర్లోనే రిలీజ్ చేయాలనే ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా విషయంలో పూరీ జగన్నాథ్ చాలా కేర్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో తాను తీసిన సినిమాలు విషయంలో ఏ తప్పులైతే జరిగాయో ఈసారి అలాంటివేం జరగకుండా కచ్చితంగా ప్రేక్షకుల్ని అలరించాలని భావిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం విజయ్ సేతుపతిని పూరీ సినిమా చేస్తున్న సినిమా గురించి అడిగితే.. తనకు కథ నచ్చే అవకాశమిచ్చానని, ఆయన గత చిత్రాల ఫ్లాప్ కావడం తనకేం సమస్య కాదని చెప్పుకొచ్చాడు.



# వచ్చే రెండు వారాలు అంతా ఆ సంగీత దర్శకుడి హవానే..!

సౌత్ ఇండస్ట్రీకి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. టాలీవుడ్, కోలీవుడ్,బాలీవుడ్‌లో సత్తా చాటుతూ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అతని పాటలు వింటే సంగీత ప్రియులు మైమరచిపోతుంటారు. ఇప్పటికే భారీ విజయాలతో దూసుకెళ్తున్న అనిరుధ్‌కు ఈ జూన్ నెల మరింత ప్రత్యేకంగా మారబోతుంది. ఎందుకంటే, ఈ నెలలో ఆయన అందించిన నాలుగు క్రేజీ సినిమాలు ప్రేక్షకులను అలరించబోతున్నాయి. ముందుగా రజనీకాంత్ నటించిన కూలి చిత్రం.ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే బిట్ సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నా, ఇప్పటి వరకు ఫస్ట్ సింగిల్ రాలేదు. తాజా సమాచారం ప్రకారం, ఈ వారం తొలి పాటను రిలీజ్ చేయాలన్నది మేకర్స్ ఆలోచన. మరోవైపు దళపతి విజయ్ పూర్తి రాజకీయాలలోకి వెళ్లే ముందు చేస్తున్న చివరి సినిమా "జననాయకన్". ఈ సినిమాకు కూడా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. జూన్ 22న విజయ్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేయనున్నారు. ఈ గ్లింప్స్ ఓ ఫీస్ట్ అవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. మూడోది ఏ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో, శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న సినిమా "మదరాసి". ఇది సెప్టెంబర్ 5న విడుదల కానుండగా, జూన్ లోనే ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గతంలో మురుగదాస్‌తో అనిరుధ్ చేసిన కత్తి, దర్బార్ మంచి విజయం పొందిన నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఉన్నాయి. ఇక విజయ్ దేవరకొండ హీరోగా, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "కింగ్‌డమ్" సినిమా కూడా అనిరుధ్ మ్యూజిక్ డైరెక్షన్‌లోనే తెరకెక్కుతోంది. ఇప్పటికే ఫస్ట్ సింగిల్ రిలీజ్ కాగా, సినిమాను జూలై లేదా ఆగస్టులో రిలీజ్ చేయాలని చూస్తున్నారు. జూన్‌లో రెండో సింగిల్ విడుదలకు ప్లాన్స్ చేస్తున్నట్టు సమాచారం. ఈ నాలుగు పెద్ద సినిమాలతో పాటు అనిరుధ్ చేతిలో మ్యాజిక్, ది ప్యారడైజ్, జైలర్ 2 వంటి సినిమాలున్నాయి. ఇప్పటికే జూన్ నెలలో రెండు వారాలు పూర్తి కాగా, మిగతా రెండు వారాల్లో సౌత్ ఇండస్ట్రీ మొత్తం అనిరుధ్ మ్యూజిక్ మాయలో మునిగిపోవడం ఖాయం!







# బాహుబలిని ఎందుకు చంపావు?..

## కట్టప్పని అడిగిన రానా నాయుడు..

నటులు దగ్గుబాటి వెంకటేష్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన పాపులర్ వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. దీనికి తాజాగా సీజన్ 2 వచ్చిన విషయం తెలిసిందే. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చేసింది. అయితే ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా.. కొత్త వీడియోను విడుదల చేసింది టీమ్. ఇందులో బాహుబాలి కట్టప్ప రానా నాయుడిని కలిసినట్లు ఈ వీడియోను పంచుకున్నారు. ఫ్యామిలీ సమస్యలతో నిద్రలేక బాధపడుతున్న రానా నాయుడిని అర్ధరాత్రి కలవడానికి వస్తాడు కట్టప్ప. అనంతరం మహిష్మతి పాలించిన మీరు ఇలా నిద్రలేకుండా సమస్యలు పడుతున్నారా అంటూ రానా నాయుడిని అడుగుతాడు కట్టప్ప. దీనికి రానా నాయుడు. మహిష్మతి రాజ్యంలో నేను ఏం చేసిన నడిచింది. ఇప్పుడు నేను ఫ్యామిలీ మ్యాన్‌ని అందుకే ఈ సమస్యలు అని చెబుతాడు. చివరిగా వెబ్ సిరీస్ చూస్తున్న కట్టప్పను.. రానా అడుగుతూ.. అవును బాహుబలిని ఎందుకు చంపావు అంటాడు. దీనికి కట్టప్ప.. నువ్వే కదా చంపమని అడిగావు అంటూ ఫన్నీగా సమాధానమిస్తాడు..

# భారీ ధరకు పెద్ది ఓటీటీ రైట్స్..!

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రమిది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఆ మధ్య ఈ సినిమా నుంచి గ్లింప్స్ వచ్చింది. ఒకే ఒక షాట్‌తో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాడు. 'ఏదైనా ఈ నేల మీదున్నప్పడే సేసేయాల, పుడతాం ఏటి మళ్లీ' అంటూ కోస్తాంధ్ర యాసలో రామ్‌చరణ్ చెప్పిన డైలాగులకు అద్భుతమైన స్పందన లభించింది. ఈ ఒక్క గ్లింప్స్‌తోనే ఓటీటీ డీల్ క్లోజ్ చేసుకుంది ఈ చిత్రం. భారీ ధరకు ఓటీటీ రైట్స్ ఇచ్చేశాడట నిర్మాత వెంకట సతీష్. డిజిటల్ రైట్స్ కోసం రెండు భారీ ఓటీటీ సంస్థలు పోటీ పడగా.. చివరకు నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుందట. అయితే ఈ డీల్‌లో కొన్ని కండీషన్స్ ఉన్నాయట. రూ. 105 కోట్లు తొలుత అందజేసి.. సినిమా రిజల్ట్‌ని బట్టి మరింత పెంచేస్తామని నెట్‌ఫ్లిక్స్ కండీషన్ పెట్టిందట. తెలుగు లో ఆడితే ఇంత.. హిందీలో ఈ స్థాయి కలెక్షన్స్ సాధిస్తే మరింత..అని ఒప్పందం కుదుర్చుకున్నారు. రిలీజ్ తర్వాత ఫలితాన్ని బట్టి రూ. 105 కోట్లతో పాటు మరింత అమౌంట్ నిర్మాతలకు వెళ్తుంది. షూటింగ్ అంతా పూర్తి చేసుకొని రిలీజ్‌కు రెడీ అయిన చిత్రాలకే ఓటీటీ డీల్ కావట్లేదు. ప్రభాస్ రాజాసాబ్, చిరంజీవి విశ్వంభర లాంటి చిత్రాలకు కూడా ఇంకా ఓటీటీ బిజినెస్ కాలేదు. అలాంటిది దాదాపు 50 శాతం షూటింగ్ పెండింగ్‌లో ఉన్న పెద్ది చిత్రానికి అప్పడే ఓటీటీ డీల్ పూర్తి కావడం గొప్ప విషయమే. మల్టీస్పోర్ట్స్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం రిలీజ్ కానుంది.





# 9 ఏళ్ల పిల్లాడితో హనీమూన్.. 40 ఏళ్ల హీరోతో ఎఫైర్..

ఇండియాలో ఆమె పాపులర్ టీవీ సీరియల్ హీరోయిన్. ఆమె టీవీ స్క్రీన్ (TV Actress)పై చేసిన రోల్స్, రియల్ లైఫ్‌లో తీసుకున్న నిర్ణయాలతో ఎప్పుడూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా ఉంటుంది. సీరియల్‌లో ఓ చిన్న పిల్లాడికి భార్యగా యాక్ట్ చేయడం నుంచి, లైఫ్‌లో ఓ సీనియర్ యాక్టర్‌తో డేటింగ్ వరకు.. ఈ బుల్లితెర హీరోయిన్ జర్నీ ఎప్పుడూ ఓ సెన్సేషన్. ఇప్పుడు ఫేమ్, లవ్, సక్సెస్‌తో లైఫ్‌ను బాగా ఎంజాయ్ చేస్తోంది. ఆమే తేజస్వి ప్రకాష్ ఎవరీమె? సౌదీ అరేబియాలో పుట్టిన ఈ మరాఠీ బ్యూటీ, ఫ్యామిలీతో ఇండియా తిరిగొచ్చి ఇక్కడే పెరిగింది. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ చదివింది. కానీ యాక్టింగే ఆమెకు అన్నిటికంటే ఇష్టం. అందుకే మంచి జాబ్ ఆఫర్ వచ్చినా వదిలేసి, 2012లో "2612" అనే షోతో స్మాల్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇచ్చింది. కలర్స్ టీవీ హిట్ సీరియల్ "స్వరాగిణి-జోడెయిన్ రిష్తోన్ కే సుర్ (Swaragini-Jodein Rishton Ke Sur)" లోని రాగిణి మహేశ్వరి (Ragini Maheshwari) క్యారెక్టర్ చేసి సూపర్ పాపులర్ అయ్యింది. ఆ తర్వాత వరుస ఆఫర్లతో, ఇండస్ట్రీలో తన మార్క్ చూపించింది. కాంట్రవర్సీతో ఫుల్ ఫోకస్: తేజస్వి కెరీర్‌లో "పెహెరేదార్ పియా కీ (Pehredaar Piya Ki)" సీరియల్‌లోని దియా క్యారెక్టర్ బాగా బజ్ క్రియేట్ చేసింది. 2017లో వచ్చిన ఈ షో స్టోరీ ఏంటంటే, 18 ఏళ్ల అమ్మాయి 9 ఏళ్ల పిల్లాడిని పెళ్లి చేసుకోవడం. ఈ వెరైటీ పెళ్లి కాన్సెప్ట్‌పై జనాలు ఫైర్ అయ్యారు. పిల్లాడితో హనీమూన్ సీన్స్ లాంటివి పెద్ద రచ్చకే దారి తీశాయి, ఆడియన్స్‌కి కోపం తెప్పించాయి. ఈ కాంట్రవర్సీ దెబ్బకు, షో కొద్ది నెలల్లోనే ప్యాకప్ చెప్పేసింది. కానీ, ఈ ఇష్యూతో తేజస్వి మాత్రం దేశమంతా ఫేమస్ అయిపోయింది. ఆ తర్వాత సక్సెస్ ట్రాక్: "పెహెరేదార్ పియా కీ" త్వరగా ఎండ్ అయినా, తేజస్వి కెరీర్‌కి ఏమాత్రం బ్రేక్ పడలేదు. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ హిట్ షోలలో నటిస్తూ, ఫ్యాన్ ఫాలోయింగ్‌ను ఓ రేంజ్‌లో పెంచుకుంది. ఏక్తా కపూర్ ప్రొడ్యూస్ చేసిన బ్లాక్‌బస్టర్ షో "నాగిన్ 6 (Naagin 6)"లో లీడ్ రోల్ చేసి, టీవీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లింది. లవ్ ట్రాక్: బిగ్ బాస్ 15 హౌస్‌లో ఉన్నప్పుడు, తేజస్వికి 40 ఏళ్ల యాక్టర్ కరణ్ కుంద్రా (Actor Karan Kundrra)తో లవ్ ట్రాక్ స్టార్ట్ అయింది. షోలోనే చిగురించిన వీళ్ల ప్రేమ, ఇప్పుడు దాదాపు 3 ఏళ్లుగా స్ట్రాంగ్‌గా కొనసాగుతోంది. కరణ్, తేజస్వి జోడిని ఫ్యాన్స్ ఇప్పటికీ ఇష్టపడతారు. ఈ కపుల్‌ను ముద్దుగా "తేజ్‌రాన్ (TejRan)" అని పిలుచుకుంటూ హంగామా చేస్తారు. స్టైలిష్ లైఫ్: ఇప్పుడు తేజస్వి గ్లామరస్‌గా, లగ్జరీ లైఫ్‌ని లీడ్ చేస్తోంది. ఇన్‌స్టాలో 71 లక్షలకు పైగా ఫాలోవర్లతో దూసుకుపోతోంది. తన డైలీ లైఫ్ అప్‌డేట్స్, ఫొటోలతో ఫ్యాన్స్‌ని ఎప్పుడూ టచ్‌లో ఉంచుతుంది. ఆమె "మన్ కస్తూరి రే" అనే మరాఠీ మూవీతో సిల్వర్ స్క్రీన్‌పైనా మెరిసింది. కొన్ని హిట్ పంజాబీ సాంగ్స్‌లోనూ కనిపించి అదరగొట్టింది. బిగ్ బాస్ 15 టైటిల్ విన్నర్ అవ్వడం తన పాపులారిటీని, సక్సెస్ రేంజ్‌ని స్కై లెవెల్‌కి తీసుకెళ్లింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com